

APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త




సంపుటి : 01 సంచిక :66 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ శనివారం - 12 - సెప్టెంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

## కాంగ్రెస్‌లో భారీ మార్పులు.. రంగంలోకి రాహుల్ గాంధీ

### 2029 లక్ష్యంగా కాంగ్రెస్‌లో సంస్థాగత మార్పులు




ఢిల్లీ,: 2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పులకు అగ్ర నాయకత్వం శ్రీకారం చుట్టింది. ఏఐసీసీ జాతీయ కార్యదర్శుల నియామకాల కోసం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ప్రియాంకా గాంధీ వాద్రాతో కలిసి ఆయన ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో సోమవారం నుంచి ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి.

## బ్రిక్స్ కూటమితో భారత్‌కు లాభమేంటి?.. కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు.. చిదంబరానికి శశి థరూర్ కౌంటర్!




ఢిల్లీ,: భారత్ ఆతిథ్యంలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ప్రారంభం కానున్న తరుణంలో ఈ కూటమి వల్ల దేశానికి కలిగే ప్రయోజనాలపై కాంగ్రెస్ పార్టీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. బ్రిక్స్ వల్ల భారత్‌కు చేకూరిన స్పష్టమైన ప్రయోజనాలు ఏమిటని పార్టీ సీనియర్ నేత పి. చిదంబరం ప్రశ్నించగా, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మాత్రం ఈ కూటమి ప్రాధాన్యతను గట్టిగా సమర్థించారు. ఇది గ్లోబల్ సౌత్ దేశాలకు ఒక ముఖ్యమైన వేదిక అని, భారత్ దౌత్య శక్తికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో మాట్లాడిన శశి థరూర్.. ఈ కూటమి ప్రాముఖ్యతను వివరించారు. 11 దేశాల ఈ సమూహం ప్రపంచ జనాభాలో,

## మూసీ ప్రక్షాళనపై కొత్త ట్విస్ట్.. రేవంత్ సర్కార్‌కు ఎన్జీటీ నోటీసులు!




హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళన, అభివృద్ధి ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన సవాల్ ఎదురైంది. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పేరుతో చేపడుతున్న పనులకు పర్యావరణ నిబంధనలు,




## మా జుట్టు పట్టుకుని లాగారు: ఢిల్లీలో ఎన్‌హెచ్ఆర్సీకి సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో తమపై జరిగిన దాడి జరిగిందని, అవమానరకరమైన ప్రవర్తన ఎదురైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ జాతీయమానవహక్కుల కమిషన్‌ను (ఎన్‌హెచ్ఆర్సీ) ఆశ్రయించింది. బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలోని మహిళా ఎమ్మెల్యేలబృందం శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్ఆర్సీ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదును అందజేసింది.

## రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే: కేటీఆర్

- ★ వీరప్పన్ మంత్రి అయితే ఎలా ఉంటుందో, రేవంత్ సీఎం కావడం అలాగే ఉందన్న కేటీఆర్
- ★ సీఎం కాకముందు ఆర్టీఐతో బ్లాక్‌మెయిల్ చేసి బతికారని ఆరోపణ
- ★ హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల భూములపై సీఎం కన్ను పడిందన్న మాజీ మంత్రి
- ★ భూదందాల వల్లే రేవంత్ రాజీనామా చేయాల్సి వస్తుందని జోస్యం
- ★ రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్న కేటీఆర్




హైదరాబాద్, : సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, భూ దందాలు చేసే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

# పాలనలో స్పీడ్ పెరగాల్సిందే.. ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్

- ➤ దస్త్రాల పరిష్కారంలో జాప్యంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం
- ➤ నెలరోజుల్లో ప్రభుత్వ ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆదేశం
- ➤ సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సూచన
- ➤ క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రజా సమస్యలు తెలుసుకోవాలని దిశానిర్దేశం




అమరావతి,: ప్రభుత్వ దస్త్రాల పరిష్కారంలో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, పాలనలో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా హెచ్చరించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను వీలైనంత వేగంగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పరిపాలనపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో దస్త్రాలను పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం ముఖ్యమని, ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి అభిప్రాయాలతో రూపొందిస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించాలని, అప్పుడే పనితీరును మెరుగుపరుచుకోగలమని సూచించారు.

నెల రోజుల్లో ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే..

ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు.

## బ్రిక్స్ సదస్సు సందర్భంగా పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

- పుతిన్‌కు ప్రధాని మోదీ ప్రత్యేక కానుక.. ఏమిటీ 'తిరుక్కురళ్' ప్రాధాన్యత?
- రష్యా అధ్యక్షుడికి 'తిరుక్కురళ్' రష్యన్ అనువాదం బహూకరణ
- తమిళ ప్రాచీన సాహిత్య గ్రంథం తిరుక్కురళ్
- మానవతా విలువలు, నైతికతపై తిరువళ్లువర్ చేసిన రచన

ఢిల్లీ,: బ్రిక్స్ సదస్సు-2026 నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ,







## ఓటర్ల జాబితా సవరణ: సమంత, విజయ్ దేవరకొండ, వీవీఎస్ లక్ష్మణ్ సహా ప్రముఖులకు నోటీసులు

## బ్రిక్స్ సదస్సుకు సర్వం సిద్ధం.. ఢిల్లీకి వచ్చే దేశాధినేతల పూర్తి జాబితా ఇదే!




- ❖ ఢిల్లీ వేదికగా నేటి నుంచి బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- ❖ హాజరు కానున్న రష్యా, చైనా అధ్యక్షులు సహా పలువురు అగ్రనేతలు
- ❖ ప్రధాని మోదీతో వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేకంగా భేటీ
- ❖ ఆహార, ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థలపై ప్రధానంగా చర్చ
- ❖ అగ్రనేతల రాకతో ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

## పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి - కలెక్టర్లకు మంత్రి లోకేశ్ ఆదేశం..




అమరావతి: పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించే దిశగా కలెక్టర్లు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యా ప్రమాణాల పెంపుతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.




## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం.. రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు




- ❖ స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన షర్మిల
- ❖ కమిటీలో రుద్రరాజు, పల్లంరాజు, కృపారాణి, తులసిరెడ్డి తదితర నేతలు
- ❖ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రచించాలని దిశానిర్దేశం

అమరావతి,: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకోవడమే లక్ష్యంగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. స్థానిక పోరులో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేయడం కోసం 8 మంది సీనియర్ నాయకులతో కూడిన 'రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ'ని ఆమె ఏర్పాటు చేశారు. ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు: సవిత




- మాస్టర్ వీవర్ ఇచ్చే ధ్రువీరణ పత్రం, వేతన వివరాలు ఇస్తే సరిపోతుందన్న సవిత
- బ్యాంక్ స్టేట్‌మెంట్ సేకరణలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్న మంత్రి
- అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు ఇస్తామని హామీ

అమరావతి,: ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'నేతన్న భరోసా' పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో అత్యంత కీలకమైన నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత,

## కాంగ్రెస్‌లో భారీ మార్పులు.. రంగంలోకి రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీలోని 10 జనపథ్‌లో సోమవారం నుంచి ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. దాదాపు 120 మంది నేతలను ఇందుకు ఎంపిక చేశారు. గ్రూపులుగా విభజించి ఒకేసారి 10 మందిని రాహుల్ గాంధీ ఇంటర్వ్యూ చేస్తున్నారు. అభ్యర్థుల ప్రొఫైల్, గతంలో చేసిన పనులు, రాజకీయ దృక్పథంపై రాహుల్ ప్రశ్నలు అడుగుతుండగా, ప్రియాంకా గాంధీ మరిన్ని వివరాలు రాబడుతున్నారు. ఈ నియామకాల్లో యువతకు, 'సంగఠన్ సృజన్' కార్యక్రమంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత జాతీయ కార్యదర్శుల్లో 60 శాతానికి పైగా మార్పులు తప్పవని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు, పార్టీలో మరిన్ని కీలక మార్పులు జరగవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. త్వరలో ఏఐసీసీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, దానికి ప్రియాంకా గాంధీని చైర్‌పర్సన్‌గా నియమించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అలాగే, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పదవీ విరమణ చేయవచ్చని, ఆయన స్థానంలో కేసీ వేణుగోపాల్‌ను నియమించవచ్చని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే, అక్టోబర్ చివరి నాటికి జిల్లా అధ్యక్షుల నియామకాలు పూర్తి చేస్తామని కేసీ వేణుగోపాల్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ మార్పుల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మార్పుపైనా చర్చ జరుగుతోంది. ప్రస్తుత ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్నారని, దీంతో ఆమె స్థానంలో కొత్తవారిని నియమించవచ్చని కొందరు నేతలు చెబుతున్నారు. అయితే, ప్రస్తుతం ఆమె తన బాధ్యతల్లోనే కొనసాగుతున్నారు. రాష్ట్రంలో పార్టీ సమస్యలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి అంశాలపై ఆమె దృష్టి సారించారు. మొత్తంగా ఈ మార్పుల ద్వారా 2029 నాటికి పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా అధిష్ఠానం అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

## బ్రిక్స్ సదస్సుకు సర్వం సిద్ధం.. ఢిల్లీకి వచ్చే దేశాధినేతల పూర్తి జాబితా ఇదే!

ఢిల్లీ: బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సుకు భారత రాజధాని ఢిల్లీ సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో (శని, ఆదివారాలు) జరగనున్న ఈ కీలక సమావేశాల కోసం ప్రపంచ దేశాల అగ్రనేతలు, ప్రతినిధులు ఇప్పటికే భారత్‌కు చేరుకుంటున్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సహా పలువురు ప్రపంచ స్థాయి నేతలు హాజరవుతుండటంతో ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.




భారత్‌కు విచ్చేయనున్న అతిథులు వీరే..

ఈ సదస్సు కోసం చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వీరాతో పాటు కొత్తగా చేరిన ఈజిప్ట్, ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాల అధినేతలు, ప్రతినిధులు ఢిల్లీకి చేరుకున్నారు. వీరితో పాటు ఐక్యరాజ్యసమితి సెక్రటరీ-జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ), న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్డీబీ) అధిపతులు కూడా ఈ సమావేశాల్లో పాలుపంచుకోనున్నారు. అగ్రనేతలకు ఆతిథ్యం ఇస్తున్న హోటళ్లు వారి కోసం ఆహారం, భద్రత, ఇతర సేవల విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ చర్చల ద్వారా ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు సమష్టి పరిష్కారాలు కనుగొనాలని బ్రిక్స్ కూటమి లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రధాన సవాళ్లే ప్రధాన అజెండా

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం (ముఖ్యంగా హార్ముజ్ జలసంధి దిగ్బంధనం), అమెరికా వాణిజ్య విధానాల వంటి అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఈ సదస్సు జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆహార భద్రత, ఇంధన రంగంలో సహకారం, ఆరోగ్యం, విపత్తుల నివారణ, కీలక వస్తువుల సరఫరా వ్యవస్థలలో సమన్వయం, స్థితిస్థాపకతను పెంపొందించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. సంక్లిష్టంగా మారిన ప్రస్తుత ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో బ్రిక్స్ కూటమిని ఒక కీలక శక్తిగా నిలబెట్టాలని భారత్ భావిస్తోంది.

మోదీతో పుతిన్ ద్వైపాక్షిక చర్చలు

ఈ సదస్సులో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేకంగా ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. పుతిన్ మూడు రోజుల పర్యటన నిమిత్తం గురువారం రాత్రే ఢిల్లీకి చేరుకున్నారు. ఈ భేటీలో రక్షణ, ఇంధనం, సాంకేతికత, ఫార్మాస్యూటికల్స్, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాల బలోపేతం వంటి పలు కీలక అంశాలపై వీరు చర్చించనున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత విస్తరించే మార్గాలపై దృష్టి సారించనున్నారు.

## బ్రిక్స్ కూటమితో భారత్‌కు లాభమేంటి?.. కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు.. చిదంబరానికి శశి థరూర్ కౌంటర్!

మొదటి పేజీ తరువాయి

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో మాట్లాడిన శశి థరూర్.. ఈ కూటమి ప్రాముఖ్యతను వివరించారు. 11 దేశాల ఈ సమూహం ప్రపంచ జనాభాలో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన వాటాను కలిగి ఉందని పేర్కొన్నారు. "గ్లోబల్ సౌత్‌లో 100కు పైగా దేశాలు ఉన్నాయి. కానీ ఇక్కడ గ్లోబల్ సౌత్‌కు చెందిన 11 కీలక దేశాలు ఉన్నాయి. ఇవి ఆ దేశాల విభిన్న అభిప్రాయాలకు సమష్టిగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయి" అని థరూర్ తెలిపారు. ఈ కూటమి ప్రపంచ జనాభాలో మెజారిటీ వాటాను, గ్లోబల్ జీడీపీలో 41 శాతం వాటాను కలిగి ఉందని, కాబట్టి ప్రపంచ దేశాలు దీనిని చాలా సీరియస్‌గా తీసుకోవాలని ఆయన అన్నారు. సభ్య దేశాల అధినేతలు, పరిశీలకులు ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా ప్రపంచంలోని కీలక దేశాలను ఒకే వేదికపైకి తీసుకురాగల భారత్ సామర్థ్యం ప్రదర్శితమవుతుందని థరూర్ చెప్పారు. ఇది దేశానికి గర్వకారణమని, ప్రపంచ వేదికపై భారత్‌కు ఉన్న 'దౌత్యపరమైన సమావేశ శక్తి'కి ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. 'ఎన్డీటీవీ' కథనం ప్రకారం.. బ్రిక్స్ కూటమిలో భాగస్వామ్యం వల్ల భారత్‌కు లభించిన ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలేమిటని చిదంబరం సందేహాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో థరూర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. నేటి నుంచి రెండు రోజుల పాటు 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు భారత్‌లో జరగనుంది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు కొత్తగా చేరిన ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సహా మొత్తం 11 అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇందులో పాల్గొంటున్నాయి. "స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం'' అనే థీమ్‌తో 2026 సంవత్సరానికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. ఈ సదస్సు ద్వారా బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాలలో మౌలిక సదుపాయాలు, ఇంధనం, డిజిటల్ రంగాల్లోని ప్రాజెక్టులకు నేరుగా నిధులు సమకూర్చే వేదికను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## మూసీ ప్రక్షాళనపై కొత్త ట్విస్ట్.. రేవంత్ సర్కార్‌కు ఎన్జీటీ నోటీసులు!

మొదటి పేజీ తరువాయి

మూసీ ప్రక్షాళన పేరుతో చేపడుతున్న పనులకు పర్యావరణ నిబంధనలు, అనుమతుల విషయంలో లోపాలున్నాయని అప్పీల్‌దారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఇచ్చిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ వారు ఎన్జీటీని ఆశ్రయించారు. దీంతో ఈ వ్యవహారం మరోసారి న్యాయస్థానం ముందుకు వచ్చింది. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే స్టడీ చేశారు. అలాగే ఈ రీజియన్‌లోనే మృగవాణి నేషనల్ పార్క్ ఉంది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ సమీపంలో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న నిర్ణయంతో పాటు వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి నోటీసులు

అప్పీల్‌ను పరిశీలించిన చెన్నై ఎన్జీటీ బెంచ్.. ప్రతివాదులుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తన వాదనలను, సంబంధిత వివరాలను ట్రిబ్యునల్ ముందు ఉంచాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే.. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన ఒక పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. దీంతో ప్రాజెక్టుకు అప్పట్లో ఊరట లభించింది.

వచ్చే నెల 16న విచారణ

తాజాగా రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణను ఎన్జీటీ వచ్చే నెల 16కు వాయిదా వేసింది. దీంతో ఆ రోజు జరిగే విచారణలో పర్యావరణ అనుమతులపై అప్పీల్‌దారులు లేవనెత్తిన అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా నది ప్రక్షాళనతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధి, మురుగునీటి సమస్య పరిష్కారం వంటి చర్యలను ప్రభుత్వం చేపడుతోంది. అయితే ప్రాజెక్టు పర్యావరణ ప్రభావం, అనుమతుల ప్రక్రియపై మొదటి నుంచీ వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఎన్జీటీలో దాఖలైన అప్పీల్‌తో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## మా జుట్టు పట్టుకుని లాగారు - ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీకి సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదును అందజేసింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద పోలీసులు తమ పట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. "మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగుతూ పోలీసులు అరాచకం సృష్టించారు. ఇదంతా ఒక పథకం ప్రకారం, కుట్రలో భాగంగానే జరిగింది" అని ఆమె పేర్కొన్నారు. తమను రక్షించేందుకు ప్రయత్నించిన తోటి ఎమ్మెల్యేలను సైతం పోలీసులు తోసివేసి కిందపడేసి తొక్కారని, ఈ ఘటనలో జగదీశ్‌రెడ్డికి రక్తపోటు పెరిగిందని, పలువురు ప్రజాప్రతినిధులకు గాయాలయ్యాయని వివరించారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతోనే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా తమను అడ్డుకునే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు తమ ఫిర్యాదులో కోరారు.

## రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి



భూ దందాలు చేసే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం కాకముందు రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి బతికేవారని, అలాంటి వ్యక్తి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక ముఠాను ఏర్పాటు చేసి, వారి కనుసన్నల్లో 22ఏ భూ దందా నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి స్కీం వెనుక ఒక స్కాం ఉందని, హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ పేర్లతో వేల ఎకరాల భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి భూదందాలకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో ఫాక్స్‌కాన్ వచ్చిన కొంగరకలాన్ భూములపై రేవంత్ కన్ను పడిందని, అక్కడ రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో వేలిముద్ర లేకుండా ఇంచు భూమి కూడా మార్చలేరని, కానీ ఇప్పుడు భూభారతితో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. భూములను కాపాడాల్సిన కాపలాదారులే కబ్జాదారులుగా మారారని అన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భూదోపిడీ జరుగుతోందని, ఈ వ్యవహారాలతో రేవంత్ రెడ్డి త్వరలోనే రాజీనామా చేయాల్సి వస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు. మరో రెండేళ్లలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర.. మహిళా అధికారుల ముందు అభ్యంతరకరంగా వ్యవహరించారు: రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాజకీయంగా ఎదిగిన సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి లాంటి నాయకులు ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేయాలని చూడటం దారుణమని సీఎం అన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోయి ఉంటే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కూడా కేటీఆర్‌కు తన రూపమే కనిపిస్తున్నట్టుందని, అందుకే అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు తెగబడుతున్నారని ఎద్దేవా చేశారు. పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా, చేపట్టిన సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎం వివరించారు. చారిత్రక భవనంలో శాసన మండలిని పునఃప్రారంభించుకోవడమే కాకుండా, అసెంబ్లీలోని సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, కేంద్రం చేపట్టబోయే జనాభా లెక్కల్లోనూ ఈ తెలంగాణ నమూనాను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో 'ఎస్ఐఆర్' పేరుతో లక్షలాది ఓట్లను తొలగించే పెద్ద కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే, ఓటర్ల జాబితాలో మాత్రం కేవలం 88 కోట్లే చూపిస్తున్నారని, అంటే దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని వివరించారు. ఎమ్మెల్యేగా మళ్లీ గెలవాలనుకునే ప్రతీ ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు పరిరక్షణను అత్యంత తీవ్రంగా పరిగణించాలని నిర్దేశించారు. శాసనసభ చర్చల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని, హాజరు శాతాన్ని కాపాడుకుంటూ స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

## బ్రిక్స్ సదస్సు సందర్భంగా పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

ఢిల్లీ,: బ్రిక్స్ సదస్సు-2026 నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, పుతిన్‌కు ఒక విశిష్టమైన సాంస్కృతిక కానుకను అందజేశారు. ప్రాచీన తమిళ సాహిత్య గ్రంథమైన 'తిరుక్కురళ్' రష్యన్ అనువాద ప్రతిని ఆయనకు బహూకరించారు. సమావేశం సందర్భంగా ఇరువురు నేతలు ఎంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. పరస్పరం కరచాలనం చేసుకుని, ఆలింగనం చేసుకున్నారు. ఈ భేటీలో పలు అంతర్జాతీయ, ద్వైపాక్షిక అంశాలపై వారు కూలంకషంగా చర్చించినట్లు సమాచారం.

ఏమిటీ తిరుక్కురళ్?

ప్రధాని మోదీ బహూకరించిన 'తిరుక్కురళ్' తమిళ సాహిత్యంలో అత్యంత ప్రాముఖ్య, గౌరవం పొందిన గ్రంథాల్లో ఒకటి. దీనిని సుప్రసిద్ధ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ రచించారు. ఇందులో నీతి, నైతికత, ప్రేమ, సంపద, పాలన, మానవ ప్రవర్తన వంటి అనేక అంశాలపై 1,330 పద్యాలు ఉన్నాయి. ఈ గ్రంథం అర్థవంతమైన, నైతిక జీవితాన్ని ఎలా గడపాలో తెలియజేసే మార్గదర్శిగా ప్రసిద్ధి చెందింది. ఇందులోని అంశాలు సార్వత్రికమైనవి కావడంతో, భాష, సంస్కృతి, దేశాల సరిహద్దులను దాటి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది. ఇప్పటికే అనేక ప్రపంచ భాషల్లోకి అనువదించబడిన ఈ గ్రంథం రష్యన్ అనువాదాన్ని పుతిన్‌కు అందించడం ద్వారా, విశ్వమానవ విలువలను చాటిచెప్పే భారతీయ సాహిత్య వారసత్వాన్ని నరేంద్ర మోదీ ఆయనకు పరిచయం చేసినట్టయింది.

## ఓటర్ల జాబితా సవరణ: సమంత, విజయ్ దేవరకొండ, వీవీఎస్ లక్ష్మణ్ సహా ప్రముఖులకు నోటీసులు

హైదరాబాద్, : కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన నిమిత్తమే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ జాబితాలో నటుడు మహేశ్ బాబు, ఆయన భార్య నమ్రత, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండలతో పాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నట్లు సమాచారం. ఫార్మా దిగ్గజం మురళీ కృష్ణ ప్రసాద్ దివి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుత వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్దిష్టమైన కారణం ఏదీ పేర్కొనలేదని కూడా వార్తలు వస్తున్నాయి. నోటీసులు అందుకున్న వారు నేరుగా హాజరై తమ వివరాలను సరిచూసుకోవచ్చని లేదా అవసరమైన పత్రాలను సమర్పించి పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో తమ తరఫున ప్రతినిధులను పంపేందుకు కూడా అవకాశం కల్పించారు. అయితే, నోటీసు జారీ అయినంత మాత్రాన ఓటు హక్కు రద్దయినట్లు కాదని, ఇది కేవలం ధ్రువీకరణ ప్రక్రియలో ఒక భాగం మాత్రమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా సాగుతోంది. కర్ణాటకలోనూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, జెరోధా వ్యవస్థాపకులు నితిన్, నిఖిల్ కామత్‌లకు కూడా ఇటువంటి నోటీసులే అందాయి. ఇదే క్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న సీఎన్ఆర్ రావుకు కూడా నోటీసు జారీ అయిందన్న వార్తలను ఎన్నికల సంఘం ఖండించింది.

## పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి - కలెక్టర్లకు మంత్రి లోకేశ్ ఆదేశం..

మొదటి పేజీ తరువాయి



విద్యా ప్రమాణాల పెంపుతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా కలెక్టర్లతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై వారికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. పాఠశాల భవనాలు పటిష్టంగా ఉండటంతోపాటు, నూతన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను వివిధ పరిశ్రమలతో అనుసంధానిస్తూ, వాటికి అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్య పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు 'నైపుణ్యం' వెబ్ పోర్టల్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలతోపాటు అవసరమైన స్కిల్ టూల్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని మంత్రి వెల్లడించారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, యువత మధ్య సమన్వయం పెంచడం ద్వారా ఉపాధి అవకాశాలను మరింత విస్తృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మరోవైపు, ఏపీలో అక్షరాస్యత పెంపుతోపాటు డిజిటల్, ఫైనాన్షియల్ లిటరసీపైనా విద్యాశాఖ దృష్టి సారించిందని లోకేశ్ తెలిపారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్వీయ రక్షణ చర్యలపైనా పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. కరిక్యులమ్ మార్పుపై ఇప్పటికే రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. విద్యార్థుల్లో భవిష్యత్ నైపుణ్యాలను పెంపొందించేలా విద్యా విధానంలో అవసరమైన మార్పులు చేపడుతున్నామని మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు: సవిత

మొదటి పేజీ తరువాయి

ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా సంబంధిత మాస్టర్ వీవర్ (సొసైటీ/యజమాని) ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాల పత్రాన్ని అందిస్తే సరిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ల సేకరణలో అర్హులైన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ సులభతర నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తామని, నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందోనని అన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం.. రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి

ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మానిటరింగ్ కమిటీలో మాజీ కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులకు ప్రాధాన్యత కల్పించారు. కమిటీ కన్వీనర్‌గా మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సభ్యులుగా సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, రాజ్యసభ మాజీ సభ్యుడు, పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డిని నియమించారు. వీరితో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా నిర్వహణ, ఎన్నికల సమన్వయ ఇన్చార్జి బాధ్యతలను నెల్లూరు డీసీసీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డికి అప్పగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని మానిటరింగ్ కమిటీకి షర్మిల స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధివిధానాల ఖరారు, గెలుపు గుర్రాలైన అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాల బాధ్యతలను ఈ కమిటీయే చూస్తుందని ఆమె వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మానిటరింగ్ కమిటీతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆదేశించారు.

## పాలనలో స్పీడ్ పెరగాల్సిందే.. ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్

మొదటి పేజీ తరువాయి



ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో అన్ని శాఖల దస్త్రాలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని స్పష్టం చేశారు. ఈ గడువు తర్వాత భౌతిక (మాన్యువల్) ఫైళ్ల నిర్వహణను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, మంత్రులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో సమస్యల పరిష్కారం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. "జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచుగా గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా సమర్పించాలి" అని అన్నారు. సమస్యలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడాలని ఆకాంక్షించారు. పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, సమర్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పష్టం చేశారు.

గ్రామ, వార్డు సిబ్బందికి జాబ్ ఛార్ట్

స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బందిపై పనిభారాన్ని హేతుబద్ధీకరించాలని (రేషనలైజ్ చేయాలని) అధికారులను ఆదేశించారు. ఒకే ఉద్యోగిపై ఎక్కువ భారం మోపకుండా, అందరికీ సమంగా బాధ్యతలు అప్పగించేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బందికి విధులను స్పష్టం చేస్తూ ఒక జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయానికి ఒక ఎలక్ట్రిక్ సైకిల్ అందించాలని కూడా సూచించారు.

## గల్వాన్ తర్వాత మారుతున్న సీన్.. మోదీతో జిన్‌పింగ్ భేటీకి ముందు చైనా కీలక ప్రకటన



ఢిల్లీ,: ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందు బీజింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, చైనా మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా స్పష్టం చేసింది. ఇరు దేశాలు మంచి పొరుగుదేశాలుగా, స్నేహపూర్వకంగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. భారత్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ సమావేశం కానున్నారు. 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ తర్వాత సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2024 అక్టోబర్‌లో భారత్, చైనా సరిహద్దుల్లో గస్తీకి సంబంధించి కీలక ఒప్పందానికి వచ్చాయి. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ క్రమంగా మెరుగుపడుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. ఆ తర్వాత ఉన్నతస్థాయి సంప్రదింపులు మరింత పెరిగాయి. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. ఇరు దేశాల నేతల మార్గదర్శకత్వంలో వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో సంబంధాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పరస్పరం సంప్రదింపులు పెంచడం, సహకారాన్ని బలోపేతం చేయడం, విభేదాలను సరిగా నిర్వహించడం తమ లక్ష్యాలని తెలిపారు. మోదీ, జిన్‌పింగ్ వరుసగా మూడో ఏడాది సమావేశం కానున్నారు. గతంలో 2025 ఆగస్టులో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. విమాన సర్వీసులు, వీసాలు, ఉన్నతస్థాయి సంబంధాలు కూడా క్రమంగా పునరుద్ధరించుకుంటున్నాయి. బ్రిక్స్ సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని సభ్య దేశాలతో కలిసి పనిచేస్తామని చైనా తెలిపింది. అంతర్జాతీయ పరిస్థితులు, బ్రిక్స్ భవిష్యత్ అభివృద్ధి, పరస్పర సహకారంపై జిన్‌పింగ్ ఇతర దేశాల నేతలతో చర్చించనున్నారు. బ్రిక్స్‌ను 2009లో ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశాల వేదికగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సహా మరిన్ని దేశాలు ఉన్నాయి.

## శుభకార్యం లో పాల్గొన్న విక్కుర్తి ఏఎంసీ చైర్మన్ కొల్లూరి

నూతన వధూవరులను ఆశీర్వదించిన విక్కుర్తి



అవనిగడ్డ సెప్టెంబర్ 11 శ్రీ వార్తఅవనిగడ్డ కోటగిరిలంకలో శుక్రవారం జరిగిన కొలసాని వెంకటరమణ, విజయకుమారి దంపతుల కుమార్తె ప్రశాంతి వివాహ రిసెప్షన్ వేడుకకు అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు మనోజ్, ప్రశాంతిలను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

## పింఛన్ దరఖాస్తులు నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి

ఎన్టీఆర్ భరోసా పింఛన్ దరఖాస్తుల నమోదు వేగవంతం చేయాలి

-గ్రామ సచివాలయాలు ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



అవనిగడ్డ సెప్టెంబర్ 11 శ్రీ వార్తఎన్టీఆర్ భరోసా పింఛన్ దరఖాస్తుల నమోదు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శుక్రవారం అవనిగడ్డ శివారు లంకమ్మ మాన్యం, మండల పరిధిలోని అశ్వారావుపాలెం, మోదుమూడి గ్రామ సచివాలయాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎన్టీఆర్ పింఛన్ భరోసా దరఖాస్తుల నమోదు ప్రక్రియ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ దరఖాస్తుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయాల సిబ్బంది బాధ్యతగా పని చేయాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల నమోదులో ఏవైనా సందేహాలు, సాంకేతిక ఇబ్బందులు వస్తే తక్షణమే తహసీల్దార్, ఎంపీడీఓల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా గ్రామ సచివాలయాల ఉద్యోగులు బాధ్యతగా పని చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని సాకారం చేయాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సూచించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు ఆయా కార్యాలయాల్లో సిబ్బంది హాజరు రిజిస్టరులు పరిశీలించారు. కార్యాలయానికి రాని వారిపై, వచ్చినా రిజిస్టరులో సంతకాలు చేయని వారిపై సాయిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు రిజిస్టర్, మూవ్ మెంట్ రిజిస్టర్ ఖచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళతానని సాయిబాబు హెచ్చరించారు. వారి వెంట తహసీల్దార్ బీ.అంకాలు, ఇంచార్జి ఎంపీడీఓ వనజ ఉన్నారు.

## స్టాంపులు నాణెల ప్రదర్శన ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సుజాత

స్టాంపులు నాన్న ప్రదర్శనకు విశేష స్పందన



అవనిగడ్డ సెప్టెంబర్ 11 శ్రీ వార్త ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవనిగడ్డ లోని అర్థశాస్త్ర మరియు చరిత్ర విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన 'చరిత్ర ప్రతిబింబించే విధముగా... నాటి ఆర్థిక వ్యవస్థల విశ్లేషణ" అనే ప్రత్యేక ఇతివృత్తంతో ఎక్స్‌పో - 2026' నాణేలు,తపాలా బిళ్ళలు (స్టాంపులు) ప్రదర్శనను శుక్రవారం అత్యంత వైభవంగా డా . కె.సుజాత ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా సింహాద్రి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ --- "స్టాంపులు, నాణేలు కేవలం సేకరించే వస్తువులు మాత్రమే కాదు; అవి నాటి ఆర్థిక స్థితిగతులకు, నాటి రాజ్యాల వైభవానికి మరియు సంస్కృతికి ప్రత్యక్ష సాక్ష్యాలు. స్టాంపులు సేకరణ అనేది ప్రవృత్తి మాత్రమే కాదు వృత్తిగా కూడా నేడు రూపాంతరం చెందిన విధానాన్ని వివరించారు . వివిధ దేశాలకు చెందిన స్టాంపులు, ఆంధ్ర రాష్ట్ర స్వతంత్ర సమరయోధుల పేరిట విడుదల చేయబడిన పోస్టల్ కవర్లు, మహనీయుల జ్ఞాపకార్థం విడుదల చేసిన స్టాంపులు, గాంధీ భగవద్గీత కనిపించే ద్వి మితీయ స్టాంపు, వంటి ఎన్నో స్టాంపులు ప్రదర్శనలో ఉంచారు.విద్యార్థుల్లో అర్థశాస్త్ర అవగాహనను, చారిత్రక పరిజ్ఞానాన్ని, పెంపొందించడానికి ఇటువంటి ప్రదర్శనలు ఎంతో తోడ్పడతాయి" అని పేర్కొన్నారు.కళాశాల పూర్వ విద్యార్థి అశ్విని కుమార్ తాను నాణేలు సేకరించే విధానం గురించి వివరించారు. నాణాలు చరిత్రకు ఆధారం మాత్రమే కాదు నాణెములు దేశ ఆర్థిక సౌభాగ్యం, పటిష్టతకు ప్రతిబింబాలని తెలిపారు. 175 దేశాలకు చెందిన నాణేలను సేకరించినట్లుగా తెలిపారు ఆసియా ఖండానికి చెందిన దేశాల నాణెములను ప్రదర్శించారుకార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుజాత మాట్లాడుతూ --- చరిత్ర మరియు అర్థశాస్త్ర విభాగాలు కలసి నాటి ఆర్థిక మూలాలను, చారిత్రక ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా ఈ ప్రదర్శనను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.స్టాంపుల , నాణెముల సేకరణ వ్యయ ప్రయాసలతో కూడినదని తెలిపారు. కళాశాలలో ఎగ్జిబిషన్ నిర్వహించినందుకు సింహాద్రి రామలింగేశ్వర రావు అశ్విని కుమారులను ప్రశంసించారు.ఈ ఎగ్జిబిషన్‌లో ప్రాచీన కాలం నుండి నేటి వరకు ఉపయోగంలో ఉన్న విభిన్న నాణేలు, అరుదైన తపాలా బిళ్ళలను ప్రత్యేకంగా ప్రదర్శించారు. .అర్థశాస్త్ర అధ్యాపకులు డా .ఏ .వీర కుమారి చరిత్ర అధ్యాపకులు తోట నరసింహారావు వైస్ ప్రిన్సిపాల్ కి అజయ్ కుమార్, ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ ఆర్ అంకారావు అధ్యాపకులు ,విద్యార్థులు ఉదయం 11:00 గంటల నుండి ప్రారంభమైన ఈ ప్రదర్శనను వీక్షించడానికిఅవనిగడ్డ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల , ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారుపాల్గొన్నారు.

## సామూహిక వ్రతాలలో పాల్గొన్న మహిళలు

## 5 విశేషాలంకరణలో స్వామివారు

## వైభవంగా సామూహికంగా శ్రీ వరలక్ష్మి అమ్మవారి వ్రతాలు



అవనిగడ్డ సెప్టెంబర్ 11 శ్రీ వార్త లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయ ఆవరణలో వైభవంగా శ్రీ వరలక్ష్మి సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శ్రావణ బహుళ అమావాస్య శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు సుమారుగా 300 మంది భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్రతాలలో పాల్గొన్న



భక్తులకు ధర్మకర్తలు పూజా సామాగ్రి తో పాటు లక్ష్మీ అమ్మవారి ప్రతిమ గాజులు వస్త్రాలు రవికలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు బృందావనం వేణుగోపాలాచార్యులు దివి రఘునాథచార్యులు అప్పలాచార్యులు నరసింహ మూర్తులు పాల్గొని సహస్రనామాలతో కుంకుమ అర్చనలు పుష్ప అర్చనలు జరిపారు. వ్రత ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. అనువంశిక ధర్మకర్త పోతరాజు భాస్కరరావు ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చివరిగా ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను వితరణ చేశారు,

## సైన్స్ అభివృద్ధి చెందుతున్న సమాజంలో మూఢనమ్మకాలను విడనాడాలి: జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ సురేష్ చంద్రారెడ్డి



పామర్రు, సెప్టెంబర్ 11 శ్రీవార్త న్యూస్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పామర్రు మండల స్థాయి చెకుముకి టాలెంట్ పోటీ పరీక్షలు శుక్రవారం స్థానిక కంచర్ల రామారావు జెడ్.పి.హెచ్ స్కూల్ లో నిర్వహించారు.ఈపోటీలో 14 పాఠశాలల నుండి 42మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.మండల స్థాయి లో ప్రభుత్వ పాఠశాలల్లో కనుమూరు జెడ్.పి.హైస్కూలు ప్రథమ స్థానంలో, పామర్రు జెడ్.పి.హైస్కూలు ద్వితీయ స్థానంలో నిలిచారు.ప్రైవేటు పాఠశాలల్లో పామర్రు అస్సిసి హై స్కూలు ప్రథమ స్థానం,జుజ్జవరం ఉషోదయ హై హైస్కూల్ ద్వితీయ స్థానం పొందాయి.గెలుపొందిన విజేతలకు జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ డాక్టర్ పి.సురేష్ చంద్రారెడ్డి ప్రసంసాపత్రాలు అందజేశారు.ఈకార్యక్రమంలో జూన్ విజ్ఞాన వేదిక నాయకులు కంచర్ల కోటేశ్వరరావు,కాకి నాగ మల్లేశ్వరరావు,దునుకు రఘునాధరావు,పెనుమాల వెంకటేశ్వరరావు,సూరవరపు శ్రీమన్నారాయణ,కొడాలి వెంకటేశ్వరరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈసందర్భంగా డాక్టర్ పి.సురేష్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఒక పక్క ప్రపంచ వ్యాప్తంగా సైన్స్, టెక్నాలజీ నానాటికీ అభివృద్ధి చెందుతున్నప్పటికీ కొందరు స్వార్థపరుల అసత్య ప్రచారాలు ప్రలోభాలవల్ల ప్రజలు మూఢనమ్మకాలకు బలవుతు న్నారన్నారు .ప్రజలు మూఢనమ్మకాల బారిన పడకుండా ఉండేందుకు జనవిజ్ఞాన వేదిక పాటు పడుతుందని పేర్కొన్నారు.

## విజయవాడ ఎయిర్‌పోర్టుకు కేంద్ర మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా స్వాగతం పలికిన ఆర్డీవో జి. బాలసుబ్రహ్మణ్యం



గన్నవరం, సెప్టెంబర్ 11 - శ్రీ వార్త న్యూస్ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, రసాయనాలు-ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా శుక్రవారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు.గన్నవరం విమానాశ్రయంలో కేంద్ర మంత్రికి కృష్ణాజిల్లా గుడివాడ ఆర్డీవో జి. బాలసుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలను సమన్వయంతో చేపట్టింది.

## మంగినపూడి బీచ్ లో 63 అడుగుల భారీ మట్టి గణపతి - రాష్ట్రంలోనే తొలిసారి




మచిలీపట్నం, సెప్టెంబర్ 11 - శ్రీ వార్త న్యూస్మచిలీపట్నం మంగినపూడి బీచ్ వద్ద రాబోయే వినాయక చతుర్థి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోనే తొలిసారిగా 63 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14 నుండి 24 వరకు 10 రోజుల పాటు పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సోదరులందరూ కలసిమెలసి పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పూజా కార్యక్రమాలకు సుమారు 2.5 లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.15వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ వేడుకలను విజయవంతం చేయడానికి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. భక్తులందరూ ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లపాటి సుబ్రహ్మణ్యం, మైనార్టీ వెల్ఫేర్ కార్పోరేషన్ డైరక్టర్ డాక్టర్ హసిం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న పల్లపాటి సుబ్రహ్మణ్యంను పరామర్శించిన మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్



మచిలీపట్నం,శ్రీ వార్త న్యూస్ అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యంను మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ శుక్రవారం పరామర్శించారు.ఈ సందర్భంగా పల్లపాటి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వేదవ్యాస్, ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం ప్రస్తుత రాజకీయ అంశాలు, పార్టీ బలోపేతం, స్థానిక విషయాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు.

## సింగపూర్ విద్యా విధానాల అధ్యయనానికి పెద్దపల్లి విద్యాశాఖ బృందం

డీఈవో జి. శారద, డీఏఎంఓ డాక్టర్ పి.ఎం. షేక్, ఉపాధ్యాయుడు వంశీ ఎంపిక

: తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో కూడిన ప్రతినిధి బృందం సింగపూర్‌లోని విద్యా విధానాలను అధ్యయనం చేసేందుకు విద్యా విజ్ఞాన సందర్శనకు వెళ్లనుంది. ఈ బృందంలో పెద్దపల్లి జిల్లా విద్యాధికారి జి. శారద, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం. షేక్, ధర్మారం మండలం రచపల్లి ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు వంశీ (ఎస్‌జీటీ) ఎంపికయ్యారు. ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు సింగపూర్‌లో విజయవంతంగా అమలవుతున్న పాఠశాల విద్యా విధానాలు, పాఠ్యప్రణాళిక, మూల్యాంకన పద్ధతులు, పాఠశాల పరిపాలన, నాయకత్వం, క్రమశిక్షణ, సమర్థవంతమైన ప్రణాళిక వంటి అంశాలను ప్రతినిధి బృందం అధ్యయనం చేయనుంది. ముఖ్యంగా విద్యార్థి కేంద్రిత బోధన, కార్యకలాపాల ఆధారిత అభ్యసనం, పరస్పర చర్చలతో కూడిన తరగతి గది బోధనా విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ఉపాధ్యాయుల వృత్తిపరమైన బాధ్యతలు, పరస్పర సహకారం, నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి, తరగతి గది నిర్వహణ వంటి అంశాలపై కూడా ఈ పర్యటనలో అవగాహన పొందనున్నారు. సింగపూర్ పాఠశాలల్లో విద్యార్థుల్లో సమయపాలన, స్వీయ క్రమశిక్షణ, బాధ్యత, సహకారం, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందిస్తున్న విధానాలను బృందం ప్రత్యేకంగా అధ్యయనం చేయనుంది. పరిశుభ్రత, సమిష్టి కృషి, సామాజిక బాధ్యత వంటి జీవన నైపుణ్యాలను విద్యార్థుల దైనందిన పాఠశాల జీవితంలో భాగంగా అమలు చేస్తున్న తీరును పరిశీలించనున్నారు. అదేవిధంగా సురక్షితమైన, సమ్మిళితమైన, క్రమబద్ధమైన, విద్యార్థి అనుకూలమైన అభ్యసన వాతావరణం కల్పించడంలో సింగపూర్ విద్యా వ్యవస్థ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయనున్నారు. అక్కడ అమలవుతున్న వినూత్నమైన, సమర్థవంతమైన విద్యా పద్ధతుల్లో తెలంగాణ పాఠశాల విద్యా వ్యవస్థకు అన్వయించగల అంశాలను గుర్తించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని డీఈవో జి. శారద తెలిపారు. ఈ అధ్యయన పర్యటన ద్వారా భవిష్యత్తులో తెలంగాణలో బోధనా నాణ్యత, విద్యా పరిపాలన, అభ్యసన ఫలితాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు.

## దివ్యాంగ పిల్లలు స్వతంత్రంగా జీవించేందుకు తల్లిదండ్రుల సహకారం అవసరం

దమ్మపేటలో బుద్ధి మాంద్యుల తల్లిదండ్రుల నెలవారీ సమావేశం

:బుద్ధి మాంద్యత కలిగిన పిల్లలు రోజువారీ కార్యకలాపాలను స్వతంత్రంగా నిర్వహించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని దమ్మపేటలో నిర్వహించిన నెలవారీ సమావేశంలో సూచించారు. దమ్మపేటలోని మదర్ థెరిస్సా మండల దివ్యాంగుల మనోవికాస మరియు పునరావాస సేవల కేంద్రంలో బుద్ధి మాంద్యుల తల్లిదండ్రుల నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బుద్ధి మాంద్యత కలిగిన పిల్లలు తమ రోజువారీ పనులను తల్లిదండ్రులపై ఆధారపడకుండా స్వయంగా చేసుకునేలా ప్రొఫెషనల్స్ తల్లిదండ్రుల పర్యవేక్షణలో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రత, రోజువారీ అవసరాలు, తమ పనులను తామే చేసుకోవడం వంటి అంశాలపై పిల్లలకు శిక్షణ అందించారు. పిల్లలకు ప్రతిరోజూ ఇదే విధంగా సాధన చేయిస్తే క్రమంగా వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి, స్వతంత్రంగా జీవించేందుకు దోహదపడుతుందని తెలిపారు.దివ్యాంగుల కార్యక్రమాల అభ్యున్నతికి ఏర్పాటు చేసిన టెక్నికల్ సపోర్ట్ ఏజెన్సీ కిరణం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రమేష్, స్థానిక ఏపీఎం సంతోష్ కుమార్, సీసీ సత్తిబాబు, ప్రొఫెషనల్స్ స్వాతి, నాగేశ్వరరావు, లక్ష్మణరావు, యాక్టివిస్ట్, సీబీఆర్ వర్కర్‌తో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన బుద్ధి మాంద్యుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి

పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి

మూకమామిడిలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం

:ములకలపల్లిమండలంలో మూకమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని సాయిరాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులకు,బాలింతలకు, తల్లులకు పోషణ ప్రాముఖ్యతను వివరించారు.పౌష్టికాహారం యొక్క పోషక విలువలను తెలియజేశారు.ప్రతి గర్భవతి ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ఒక పూట సంపూర్ణ భోజనం తీసుకోవాలని,గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషకాహారం,గుడ్లు,పాలు వంటివి తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ సామ్రాజ్యం, ప్రధానోపాధ్యాయురాలు అజ్మీర్ లలిత,అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ,రాధ,విజయ,రమాదేవి,వసంత,సునీత మరియు పిల్ల తల్లులు గర్భిణి స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహార లోపానికి గురికాకుండా అవసరమైన పౌష్టికాహారం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

, బాలరాజు 11 సెప్టెంబర్ 2026 శుక్రవారం9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషకాహారం ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహార లోపానికి గురికాకుండా అవసరమైన పౌష్టికాహారం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పోషకాహార లోపాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వారికి తగిన వైద్య, పోషకాహార సేవలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని తెలిపారు. స్థానికంగా లభించే పౌష్టిక విలువలు కలిగిన ఆహార పదార్థాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పోషణ మాసం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పోషకాహారంపై అవగాహన పెంచేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు సుధారాణి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈ-ఫైల్స్ క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడికి వరుసగా మూడోసారి మొదటి స్థానం



--- వేగవంతమైన ఫైళ్ల పరిష్కారం.. సమర్థవంతమైన పనితీరుకు సీఎం చంద్రబాబు ప్రశంసలు

సెప్టెంబర్ 11: ఈ-ఫైల్స్ క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ-ఫైళ్ల పరిష్కారంలో వరుసగా మూడోసారి మొదటి స్థానంలో నిలిచి తన పనితీరును చాటుకున్నారు. అత్యంత వేగంగానే కాకుండా పారదర్శకంగా, సమర్థవంతంగా ఫైళ్లను పరిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. ఫైళ్ల పరిష్కారంలో వేగంతో పాటు స్పష్టత, పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యత ఇస్తూ మంత్రి అచ్చెన్నాయుడు ముందుకు సాగుతున్నారని సీఎం ప్రశంసించారు. ప్రభుత్వ పరిపాలనలో జాప్యాన్ని తగ్గిస్తూ..., నిర్ణయాలను వేగంగా తీసుకోవడంలో ఈ-ఫైలింగ్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ-ఫైల్స్ క్లియరెన్స్‌లో వరుసగా మూడోసారి మొదటి స్థానాన్ని సాధించడం మంత్రి అచ్చెన్నాయుడు పనితీరుకు నిదర్శనమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గంటల వ్యవధిలోనే ఫైళ్లను పరిశీలించి పరిష్కరించడం ద్వారా మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకతను చాటుతున్నారని అభినందించారు. పారదర్శకత, వేగం, సమర్థతకు పెద్దపీట వేస్తూ మంత్రి అచ్చెన్నాయుడు కొనసాగిస్తున్న పనితీరు ఇతర శాఖలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.

శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
జనరల్ న్యూస్
శనివారం -12-సెప్టెంబర్- 2026

## ఐ డి ఓ సి సముదాయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి.

–నారాయణపేట జిల్లా కలెక్టర్ సి హెచ్ ప్రియాంక అధికారులను ఆ దేశించారు.....



శుక్రవారం నూతనంగ నిర్మిస్తున్న ఐ డి ఓ సి భవనాన్ని జిల్లా కలెక్ట ర్ తనిఖీ చేశారు. కలెక్టర్ ఛాంబ ర్, మినిస్టర్ ఛాంబర్ పరిశీలించా రు.అలాగే టాయిలెట్స్ వాటర్ ఆ ర్వో ప్లాంట్ వైరింగ్ తదితర పను లు వెంటనే పూర్తి చేయాలన్నారు ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు వెం టనే అన్ని పనులు పూర్తిచేయాల న్నారు.అలాగేమీటింగ్ హాల్లోస్క్రీ న్ ఏర్పాటు చేయాలన్నారు. భవ నం బయట హార్టికల్చర్ వారు గ్రీ నరీ పనులు పూర్తి చేయాలని క లెక్టర్ అధికారులనుఆదేశించారు ఆర్ అండ్. బి. ఈ. ఈ. వెంకటరమణ, డి.ఈ.రాములు సంబంధి త అధికారులు తదితరులు పా ల్గొన్నారు.'

## పర్యావరణ పరిరక్షణ మన అందరి ధ్యేయం కావాలి....

మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేసిన జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బి .ఎస్.లత

జగిత్యాల జిల్లా, సెప్టెంబర్ 11, :సోమవారం జరగనున్న వినాయక చవితి సందర్భంగా పర్యావరణ



పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి ప్రతిమలను జిల్లా స్థానిక సంస్థల అతను కలెక్టర్ బి.ఎస్. లత ప్రజలను కోరారు.జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమంలో మట్టి గణపతులను ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఈ.కిషన్ తో పాటు కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎం ఉదయ్ కుమార్, ట్రెసా జిల్లా అధ్యక్షులు ఎండి వకీల్, క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ ఉద్యోగుల ఉపాధ్యక్షులు ముజాహిద్ ఖాన్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, కలెక్టరేట్ ఉద్యోగులు, కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి ధ్యేయం కావాలని, ఈ నినాదంతోనే కాలుష్యనియంత్రణ మండలి జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు..ఈ మట్టి గణపతి విగ్రహాలను జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందిస్తున్నట్లు ఆమె ఈ సందర్భంగా వివరించారు.

## రాణి లక్ష్మమ్మ జాతర మహోత్స వం.

నారాయణపేట శివారులో వెలిసి న రాణి లక్ష్మమ్మ ఆలయంలోజాత ర ఉత్సవాలు వైభవంగా జరిగా యి......

నారాయణపేట జిల్లా ప్రతినిధి1 1(శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుండి పెద్దఎత్తున భక్తులు అమ్మాయిని దర్శనం చే సుకొని ప్రత్యేక పూజలు చేశారు.





లోకపల్లి సంస్థనాన్ని పాలించే రా ణి లక్ష్మమ్మ నిజాం నవాబుకు వ్య తిరేకంగా వ్యవహరిస్తోందని ని జాం నవాబు ఆదేశాల మేరకు అ ప్పట్లో సంస్థానం పై యుద్ధం చేశా రు. యుద్ధంలో పరాజయం పొం దటం ఇష్టం లేని రాణి లక్ష్మమ్మ ఆత్మార్పణం చేసుకుంది.అదే స్థ లంలో చెట్టుగా మొలిసిందని భ క్తుల నమ్మకం ఆ చెట్టును అమ్మ వారిగా భావించి సుమారు150 సంవత్సరాలుగా పూజించడం ఆనవాయితీగా వస్తోంది.లోకప ల్లి సంస్థానాధీశురాలు రాణి లక్ష్మ మ్మ ను దేవతగా శ్రావణ మాసం లో ప్రతి శుక్రవారాలు ప్రత్యేక పూ జలు నిర్వహించడం శ్రావణ మా సం చివరి శుక్రవారం నాడు జాత ర మహోత్సవం నిర్వహిస్తారు. జాతర మహోత్సవానికి తెలంగా ణ లోని వివిధ జిల్లాల నుండే కా కుండా కర్ణాటక మహారాష్ట్ర ల నుండి భక్తులు హాజరై తమ మొ క్కులను తీర్చుకున్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి




హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సెప్టెంబర్ 11: గురువారం ఎల్కతుర్తి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీ పిలుపుమేరకు సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం ను అధికారికంగా ప్రభుత్వమే నిర్వహించాలని ఎల్కతుర్తి మండల తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి 1947 ఆగస్టు 15 అర్ధరాత్రి స్వాతంత్రం వచ్చినప్పటికీ తెలంగాణ ప్రాంతం ఇంకా స్వాతంత్రం పొందకుండా నిజాం నిరంకుశ పాలనలోనే ఉన్నది. హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలన నుండి భారత యూనియన్ లో విలీనమైనది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎంతోమంది రైతులు,విద్యార్థులు,మహిళలు,కూలీలు,సామాన్య ప్రజలు తమ హక్కుల కోసం ధైర్యంగా పోరాడారు ఎందరో ఉద్యమకారులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారు. వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత అని. ఎందరో ప్రాణ త్యాగాలు చేసి స్వేచ్ఛ,సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు కుడితాడి చిరంజీవి, పల్లెపాటి మధుకర్,చిదురాల వెంకటేష్, అల్లి కుమార్,వేల్పుల శ్రీనివాస్, కోడం రమేష్,హింగె దేవరావు, తక్కల్లపల్లి సంపత్ రావు, గూడెం నాగరాజు, కంచర్ల శంకరయ్య,మూషిక వెంకటేష్ యాదవ్, పెరుగు మధు,భాస్కరరావు,రావుల సంతోష్,కపీ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిరీత

గడువులోగా పూర్తి చేయాలి...

.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

పనుల్లో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి.. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి

తదుపరి సమీక్ష సమావేశం నాటికి పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించాలి

స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించాలి

దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న 127 ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ భాగం పరిధిలోని అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



జగిత్యాల జిల్లా, సెప్టెంబర్ 11, అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారుజిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన ప్రతి అభివృద్ధి పనిని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. పనుల అమలులో ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని వెంటనే పరిష్కరించాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి అయినా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు మధ్యలో నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.మండలాల వారీగా పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్న పనులు, ప్రారంభం కాని పనుల వివరాలను కలెక్టర్ సమీక్షించారు. తదుపరి సమీక్ష సమావేశం నాటికి ప్రతి పనిలో స్పష్టమైన పురోగతి కనిపించేలా అధికారులు లక్ష్యాలను నిర్దేశించుకొని పనిచేయాలని సూచించారు.స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని భూ సమస్యలు, సాంకేతిక సమస్యలు, ఇతర పరిపాలనా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కొన్ని భవన నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నందున, వాటిని త్వరితగతిన పూర్తి ప్రక్రియలు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పరిధిలో మొత్తం 2,949 పనులకు రూ.497.03 కోట్ల అంచనా వ్యయం ఉండగా, ఇప్పటివరకు రూ.128.13 కోట్ల వ్యయం జరిగినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వీటిలో 842 పనులు పూర్తికాగా, 839 పనులు పురోగతిలో, 1,268 పనులు ప్రారంభం కాలేదు.127 ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలు చాలాకాలంగా పరిష్కారం కాకుండా ఉన్నందున వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ భవనాల పనుల్లో పురోగతి చాలా తక్కువగా ఉందని, పనుల వేగాన్ని గణనీయంగా పెంచాలని సూచించారు. అలాగే రెండేళ్ల క్రితం మంజూరైన కిచెన్ షెడ్లు, అంగన్‌వాడీ భవనాలు, మరుగుదొడ్లు, గ్రామపంచాయతీ భవనాల పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని, వాటిని ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రారంభం కాని పనులన్నీ వచ్చే వారం క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.ఉపాధి హామీ పనులపై సమీక్షమహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వి బి జి రామ్ జి కింద జిల్లాలో చేపడుతున్న పనుల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు.2026 సెప్టెంబర్ 11 నాటికి జిల్లాలో మొత్తం 971 ఉపాధి హామీ పనులకు రూ.77.44 కోట్ల అంచనా వ్యయం ఉండగా, 304 పనులు పూర్తయ్యాయి, 464 పనులు పురోగతిలో ఉన్నాయి, 205 పనులు ప్రారంభం కాలేదు. గత సంవత్సరానికి సంబంధించిన వ్యయం రూ.14.42 కోట్లు కాగా, 2026--27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.3.57 కోట్ల వ్యయం జరిగింది. మొత్తంగా రూ.17.99 కోట్ల వ్యయం నమోదైనట్లు అధికారులు వివరించారు.ఉపాధి హామీ కింద గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, గ్రామ సంస్థల భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, పలు ఇతర మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.ఉపాధి హామీ పనుల్లో ప్రారంభం కాని పనులను కూడా త్వరితగతిన ప్రారంభించి, నిర్దేశించిన 100 రోజుల కార్యాచరణ ప్రకారం పనుల పూర్తికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భూ సమస్యలు, ఏజెన్సీ సమస్యలు, అవసరం లేని పనులు, ద్వంద్వ మంజూర్ల లో వంటి కారణాలతో నిలిచిపోయిన పనులను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. గ్రామ పంచాయతీ భవనాల కింద 90 పనులకు రూ.17.96 కోట్లు, అంగన్‌వాడీ భవనాల కింద 76 పనులకు రూ.9.12 కోట్లు, పాఠశాలల మరుగుదొడ్ల కింద 354 పనులకు రూ.7.08 కోట్లు, కిచెన్ షెడ్ల కింద 98 పనులకు రూ.5.35 కోట్లు, గ్రామ సంస్థల భవనాల కింద 345 పనులకు రూ.34.50 కోట్లు అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద ఒక పనికి రూ.1.43 కోట్లు, ఉప కేంద్రాల కింద నాలుగు పనులకు రూ.80 లక్షలు, పలు ఇతర మౌలిక వసతుల పనులకు రూ.1.20 కోట్ల అంచనా వ్యయంతో పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు.ప్రతి పనికి సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేసిన కాంగ్రెస్

ఎల్కతుర్తి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సెప్టెంబర్ 11 ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ సహకార సంఘం ఎన్నికలను నిర్వహించకుండా ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతిన నిర్వహిస్తుందని, తక్షణమే రైతుల ఆమోదయోగ్యమైన ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గతంలో సింగిల్ విండో అధ్యక్షునిగా పనిచేసిన శ్రీపతి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, సహకార సంఘాలు రైతుల వాటాదనంతో ఏర్పాటు చేసుకున్నారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం ఫెర్టిలైజర్స్, ఫెర్టిసైడ్స్, వ్యవసాయ రుణాలు తీసుకొనుటకు వ్యవసాయదారులు అందరూ కలిసి 13 మంది డైరెక్టర్లను ఓట్ల ద్వారా ఎన్నుకొని ఆ కమిటీ ద్వారా సంఘాన్ని ఐదు సంవత్సరాలు నడిపిస్తారు. ఈ సంఘానికి ప్రభుత్వం నుండి ఎలాంటి పెట్టుబడులు ఉండవు. సంఘాల మీద అజమాయిషి మాత్రమే ప్రభుత్వానికి ఉంటుందని, ఎల్కతుర్తి సహకార సంఘం 2020 సంవత్సరంలో నష్టాల బాటలో ఉండగా,2020 రైతుల ద్వారా ఎన్నుకోబడిన పాలకవర్గం 2025 వరకు లాభాల బాటలో సంఘాన్ని తీసుకురావడం, సంఘంలో దాదాపు మూడు కోట్ల రూపాయల డిపాజిట్లు చేయడం జరిగింది. లాభాల బాటలో ఉన్న సంఘ సభ్యులకు నాలుగు శాతం పర్సంటేజ్ ని బోనస్ గా ఇస్తూ, అడిగిన ప్రతి రైతుకు వ్యవసాయ రుణాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. సహకార చట్టం ప్రకారం ఐదు సంవత్సరాలకు ఒకసారి పార్టీలకతీతంగా ఎన్నికలు జరపాలి కానీ ఇంతవరకు నామినేటెడ్ పద్ధతి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల ద్వారా రైతుల మద్దతుతో గెలవలేని పరిస్థితి ఏర్పడినందున అడ్డదారిలో నామినేటెడ్ పద్ధతి ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తమ నాయకులకు పదవులు ఇచ్చుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం సహకార చట్టానికి విరుద్ధంగా రైతులతో ఎన్నికల జరుపకుండా నామినేటెడ్ పద్ధతిలో నియామకం చేయడం రైతు వ్యతిరేక నిర్ణయమని,రైతులు ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుకు వ్యతిరేకంగా నామినేటెడ్ పద్ధతి తీసుకురావడం సహకార సంఘాలను నిర్వీర్యం చేయడం శుభ పరిణామం కాదని అన్నారు. సహకార సంఘాల్లో ఎలాంటి రాజకీయ పార్టీల ప్రమేయం ఉండకూడదు తక్షణమే సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు యెల్తూరి స్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తంగెడ మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, మాజీ ఎంపీటీసీ ల ఫోరం అధ్యక్షులు కడారి రాజు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గొల్లె మహేందర్, బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జూపాక జడ్సన్, హుస్నాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ వి ఉపాధ్యక్షులు గౌడిశాల



వినయ్ కుమార్ గౌడ్, సొసైటీ మాజీ డైరెక్టర్లు కాగితాల శ్రీనివాస్,రాజిరెడ్డి,సమ్మయ్య,పోచయ్య సీనియర్ నాయకులు మదన్ మోహన్ రావు, మంకని చేరాలు, కోరే రాజ్ కుమార్ బొంకూరి కార్తీక్,పాటి భగవాన్ గౌడ్, రాజు,రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలు కలిగిన తల్లి దండ్రులకు అవగాహన కార్యక్ర మం.



నారాయణపేట జిల్లా ప్రతినిధి 1 1)నారాయణపేట జిల్లాలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు ఎంత మంది ఉన్నారు, వారి అవసరా లు ఏమిటి, వారికి ప్రభుత్వం త రఫున అందుతున్న పథకాలు,సే వలు అనే విషయాలపై తల్లిదం డ్రులకు పూర్తి అవగాహన కల్పిం చాల్సిన అవసరం మనకు ఎంతై నా ఉందనీ జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. శుక్రవారం ప్రత్యేక అవసరాలు కలిగిన తల్లి దండ్రులకు అవగాహనా కార్యక్ర మంలో జిల్లాకలెక్టర్ ప్రియాంక పా ల్గొన్నారు.జిల్లా కేంద్రం లోనియస్ ఆర్ గార్డెన్ లో విద్యా శాఖ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్య క్రమం లో జిల్లా కలెక్టర్ ముఖ్య అ తిథిగా హాజరై విద్యార్థులతల్లిదం డ్రులకు సూచనాలు సలహాలు ఇ చ్చారు. ముఖ్యంగా పిల్లలకు రా వాల్సిన పెన్షన్ వస్తుందా లేద,వా రు ఏదైనా పాఠశాల కు అనుసం ధానమై ఉన్నారా, ఐ ఆర్ పీ లు వారి ఇళ్లకు వెళ్లి అవసరమైన సే వలు అందిస్తున్నార అనేవిషయా లను అధికారులు,సిబ్బంది ఎప్ప టికప్పుడు పరిశీలించాలని సూ చించారు.గత కొన్ని రోజుల క్రితం విద్యాశాఖ ఆధ్వర్యంలోపిల్లలను హైదరాబాద్‌లోని నెహ్రూ జూలా జికల్ పార్క్‌కు తీసుకెళ్లడం జరి గిందని,అదే విధంగా ఆసక్తి ఉన్న మరికొంతమంది పిల్లల కు మరో సారి సందర్శన ఏర్పాటు చేయా లని జిల్లా విద్యాశాఖ అధికారుల ను ఆదేశించారు.రాబోయే రెండు వారా ల్లో ఈ కార్యక్రమాన్ని ప్రణా ళిక చేసి నిర్వహించాలని సూచిం చారు.అలాగే, ఈరోజు ఇక్కడ ఉ న్న పిల్ల లందరి కీ పెన్షన్ అందు తుందా లేదా అనే విషయాన్ని అ ధికారులు,ఐ ఆర్ పీ లు ప్రత్యేకం గా పరిశీలించాలని, ఎవరికైనా పె న్షన్ అందకపోతే, వారికి అవసర మైన ధ్రువపత్రాలు,దరఖాస్తు ప్రక్రి యపై అవగాహన కల్పించాలన్న రు. అదేవిధంగా,ప్రభుత్వ జనర ల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న స దరం, యూడీఐడీ క్యాంపుల కు పిల్లలను తీసు కెళ్లేందుకు ప్రత్యే కంగా ఒకటి లేదా రెండు రోజులు ప్రణాళిక రూపొందించి ఇంకా ధ్రు వపత్రాలు పొందని పిల్లలను గు ర్తించి, వారిని క్యాంపులకు తీసు కెళ్లి అవసరమైన ప్రక్రియను పూ ర్తి చేయించాలన్నారు.అనంతరం అర్హత ఉన్న వారికి పెన్షన్ కోసం దరఖాస్తు చేసే విధంగా చర్యలు తీసుకోవలన్నారు.ఈ కార్యక్రమం లో ఉన్న ఐఆర్‌పీలు ప్రతి కుటుం బంతో ప్రత్యేకంగా అనుసంధాన మై, అవసరమైన సమాచారాన్ని సేకరించి, పిల్లలకు అందాల్సిన సేవలు అందేలా చూడాలని, ఈ విషయంలో జిల్లా విద్యాశాఖ అ ధికారి, డీ ఆర్ డీ ఓ అధికారులు సమన్వయంతో పనిచేయలన్నా రు. గత కొన్ని రోజుల క్రితం ఉ ట్కూర్‌లో నిర్వహించిన వెరిఫికే షన్ సందర్భంగా, ఒక స్వచ్ఛంద సంస్థ సహకారం తో వినికిడి లో పం ఉన్న చిన్నారులకు వినికిడి పరికరాలు అందించడం జరిగిం దని పేర్కొన్నారు. మాటలు రాని లేదా వినికిడి సమస్యలు ఉన్న చిన్నారులను గుర్తించి,వారికి అ వసరమైన సహాయం అందించ డం మనందరి బాధ్యత అని గు ర్తు చేశారు.అదేవిధంగా, రేపు 1 5వ తేదీన అలంకో సంస్థ సహకా రంతో మనజిల్లా స్థాయిలో మరో ప్రత్యేక క్యాంపునిర్వహించబోతు న్నమని,ఈ కార్యక్రమంలోఅధికా రులు,ఐఆర్‌పీలు, తల్లిదండ్రులు పిల్లలు తప్పనిసరిగా పాల్గొనాల ని,ఇంకా ఈ సమాచారం తెలియ ని పిల్లలు, కుటుంబాలను గుర్తిం చి కార్యక్రమానికి తీసుకురావాల న్నారు.తల్లిదండ్రులకు ప్రత్యేకం గా... ఈ కార్యక్రమాని కి వచ్చిన తల్లిదండ్రులందరికీన ప్రత్యేక అ భినందనలు తెలియజేస్తున్నానుపిల్లలను పెంచడం అనేది ప్రతి త ల్లిదండ్రి కి ఒక గొప్ప బాధ్యత. అ యితే ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను పెంచడానికి మరింత ఓ ర్పు,సహనం,ప్రేమ,అంకితభావం అవసరం. మీరు చూపిస్తున్న ఆ ప్యాయత, సహనం, కృషి నిజం గా అభినందనీయం అని కొని ఆ డారు.ప్రతి చిన్నారిలోనూ ఏదోఒ క ప్రత్యేక ప్రతిభ, ఆసక్తి లేద కళ దాగి ఉంటుంది,అది చిత్రలేఖనం కావచ్చు, సంగీతం కావచ్చు, క్రీడ లు కావచ్చు, చదువు కావచ్చు లే దా మరేదైనా నైపుణ్యంకావచ్చు.ఆ ప్రతిభను మనం గుర్తించి, పిల్ల లను ప్రోత్సహిస్తే,వారికి తగిన అ వకాశాలు కల్పిస్తే, వారు తమ జీ వితంలో తప్పకుండా మంచి విజ యాలు సాధించగలరని కా బట్టి తల్లిదండ్రులు తమ పిల్లల్లో ఉన్న ప్రత్యేక ఆసక్తి, ప్రతిభను గుర్తించి, దానికి అనుగుణంగా వారిని ప్రో త్సహించి,వారి భవిష్యత్తును ఆ త్మవిశ్వాసంతో నిర్మించేందుకుమ నమందరం కలిసి కృషి చేయాల ని, ఇక్కడికి విచ్చేసిన పిల్లలందరి కీ, తల్లిదండ్రులందరికీ, అధికారు లందరికీ మరోసారి నా శుభాకాం క్షలు తెలుపుతు, ఆ భగవంతుని ఆశీస్సులు మీ అందరిపై ఎల్లప్పు డూ ఉండాలని కోరుకుంటూన్న ట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఈ వో గోవిందరాజు, రాజేంద ర్,నాగరాజ్,నారాయణపేటఎం .ఈ.ఓ.డి పి ఆర్ ఓ రషీద్ , డాక్టర్ జగదీష్ అపోలో హాస్పిటల్ చిల్డ్ర న్ స్పెషలిస్ట్, సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.

# వృక్షాలతోనే మానవ జాతి మనుగడ సాధ్యం..

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సౌబగ్య సేవా సంకల్ప

సిద్ద వెంకట సూర్య ప్రకాష్ రావు పుట్టినరోజున

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలుచోట్ల మొక్కలు నాటిన సభ్యులు..



మక్తల్ ప్రతినిధి సెప్టెంబర్ 11 మక్తల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ (అంతర్జాతీయ అధ్యక్షులు ) సౌభాగ్య సేవాసంకల్ప కే సి జి ఎఫ్ శిద్దా వెంకట సూర్య ప్రకాష్ రావు పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని పలుచోట్ల మొక్కలు నాటినట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరిక్రిష్ణ తెలిపారు.తొలుత వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, అనంతరం స్థానిక మక్తల్ పట్టణం ప్లే గ్రౌండ్ ఎంపీపీ ఎస్ పాఠశాల, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం , వాసవి మాత దేవాలయం వద్ద పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. వాసవి క్లబ్ మాజీ డిప్యూటీ గవర్నర్ కల్వ శ్రీనివాస్, సంఘ పెద్దలు మాట్లాడుతూ.. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ స్థాయిలో ప్రతి క్లబ్బు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెట్టుకున్నాయని, అందులో భాగంగా మక్తల్ పట్టణంలో మొక్కలు నాటడం జరిగిందని, డోనర్లు వైశ్యులు ఉంటారని సేవా మాత్రం అన్ని వర్గాల ప్రజలకు బీదవారికి మా వాసవి క్లబ్ తరపున చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మేడిశెట్టి హరికృష్ణ మాట్లాడుతూ.. చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, చెట్లుగా మారే వరకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ మాజీ డిప్యూటీ గవర్నర్ కల్వ శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు బిలకంటి నరసయ్య, మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మనసాని వెంకటేష్,వాసవి సభ్యులు తాలంపల్లి రవికుమార్, ఎంఈఓ అమిరుద్దీన్, కార్యదర్శి ఆంజనేయులు,ఎమ్మార్సీ కోఆర్డినేటర్ గౌడంపల్లి శ్రీనివాస్, ఎంపీపీ ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు
## ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలి..
## అధికారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం



కామారెడ్డి, సెప్టెంబర్ 11: సెప్టెంబర్ 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే వేడుకలకు వేదిక, ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్, జాతీయ పతాకావిష్కరణకు సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, అధికారులు, సిబ్బందికి తాగునీరు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పోలీసు గౌరవ వందనం, బందోబస్తు తదితర అంశాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డీఆర్ఓ పాండు, డీఆర్డీఓ పీడీ దామోదర్ రెడ్డి, జడ్పీ సీఈఓ చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మట్టి గణపతుల వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

రసాయనిక రంగులతో తయారైన విగ్రహాలకు దూరంగా ఉండాలి..

మట్టి గణపతులను ప్రతిష్ఠించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి, సెప్టెంబర్ 11 పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతుల ప్రతిమలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జనహిత గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి గణపతుల ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రతిమలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వినాయక చవితి సందర్భంగా రసాయనిక రంగులతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా నిమజ్జనం సమయంలో నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించినవారవుతారని తెలిపారు.ప్రజల్లో పర్యావరణహిత వినాయక విగ్రహాల వినియోగంపై మరింత అవగాహన కల్పించేందుకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి మట్టి గణపతుల వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, శిక్షణ కలెక్టర్ రవితేజ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి, టీజీవో అధ్యక్షుడు డాక్టర్ ఆర్. దేవేందర్, ముల్క నాగరాజు, బద్దం సాయిరెడ్డి, మామిళ్ల చక్రధర్, కలెక్టరేట్ ఉద్యోగులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంథని మండలంలో 25 మందికి పురస్కారాలు



మంథని, సెప్టెంబర్ 11 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంథని మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్, ప్రైవేటు సంస్థలు, కార్యాలయ సిబ్బంది తదితర విభాగాల్లో మొత్తం 25 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేశారు. మండల విద్యాధికారిణి దాసరి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, రెండో వార్డు కౌన్సిలర్ నూకల కమల్, పాక్స్ పర్సన్ ఇంచార్జి కొత్త శ్రీనివాస్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ జిల్లా సభ్యుడు మంథని సురేష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి శ్రీజ రెడ్డి, ముత్తారం మండల విద్యాధికారి హరి ప్రసాద్ హాజరయ్యారు. పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు మోసం శ్రీనివాస్, ఈదులపల్లి నరసింహారావు, ఆర్. రమేష్ తదితరులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ భావి పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అత్యున్నత పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలతో సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తూ వివిధ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందన్నారు. వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే నిర్మితమవుతుందని అన్నారు. ఒక దేశాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో గురువుల పాత్ర కీలకమని, వారి సేవలను ఎన్నటికీ మరువలేమన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి శ్రీజ రెడ్డి మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని అన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేసే ఉపాధ్యాయులను స్మరించుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. అనంతరం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పురస్కార గ్రహీతలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో కూడిన జర్నలిజానికి గుర్తింపు...

బొమ్మెన కుమార్‌కు

'సాక్షి ఎక్సలెన్స్--

2026' అవార్డు

మండల కేంద్రంలోని

వైశ్యభవన్‌లో పాత్రికేయ

మిత్రుల ఘన సన్మానం....

వెల్లువెత్తిన

ప్రజాప్రతినిధులు,

నాయకుల

అభినందనలు...



జగిత్యాల జిల్లా, సెప్టెంబర్ 11, న్యూస్:క్షేత్రస్థాయి ప్రజా సమస్యలపై నిరంతరం కలం ఝుళిపిస్తూ, విలువలతో కూడిన జర్నలిజంలో తనదైన ముద్ర వేసిన 'సాక్షి' గొల్లపల్లి, ధర్మపురి నియోజకవర్గ ఆర్సీ ఇన్‌ఛార్జ్ బొమ్మెన కుమార్‌కు ప్రతిష్ఠాత్మక 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డు--2026' లభించింది. కరీంనగర్ యూనిట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సాక్షి కరీంనగర్ ఎడిషన్ ఇన్‌ఛార్జ్ ముజాఫర్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో మండల పాత్రికేయ మిత్రుల ఆధ్వర్యంలో కుమార్‌కు ఆత్మీయ అభినందన సభ నిర్వహించి, ఘనంగా సన్మానించారు.18 ఏళ్ల ప్రస్థానానికి దక్కిన గౌరవంజగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం భీంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన బొమ్మెన కుమార్, 2008లో సాక్షి దినపత్రిక ప్రారంభం నుంచి గత 18 ఏళ్లుగా సుదీర్ఘకాలం పాటు పాత్రికేయుడిగా విశేష సేవలందిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుంటూ, పత్రికా విలువలకు కట్టుబడి పనిచేస్తున్న ఆయన సేవలను గుర్తించిన సాక్షి యాజమాన్యం ఈ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించింది.

### బాధ్యతను మరింత పెంచింది: బొమ్మెన కుమార్

సన్మాన అనంతరం బొమ్మెన కుమార్ మాట్లాడుతూ.. 18 ఏళ్ల సుదీర్ఘ జర్నలిజం ప్రస్థానంలో ఈ పురస్కారం దక్కడం ఎంతో సంతృప్తిని, గర్వాన్ని ఇచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో తాను చేస్తున్న పనితీరును గుర్తించి ప్రోత్సహించిన సాక్షి యాజమాన్యానికి, ఎడిషన్ ఇన్‌ఛార్జ్ ముజాఫర్, బ్యూరో ఇన్‌ఛార్జ్ అనిల్ కుమార్, డెస్క్ ఇన్‌ఛార్జ్ సంతోష్ కుమార్, సబ్ ఎడిటర్లతో పాటు నిరంతరం వెన్నంటి నిలుస్తున్న తోటి పాత్రికేయ మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తానని స్పష్టం చేశారు.

### వైశ్య భవన్‌లో ఘన సన్మానం..

### వెల్లువెత్తిన అభినందనలు

వైశ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తోటి పాత్రికేయ మిత్రులు బొమ్మెన కుమార్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కుమార్ కు ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కడంపై నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, అధికారులు, ప్రజాసంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు,పాత్రికేయులు కచ్చు కొమురయ్య,చిర్ర దిలీప్ ,నర్సాపురం రవీందర్, పొలాస గంగాధర్, భోజనపు శ్రీనివాస్,బోడుగం గంగాధర్, చౌటపెల్లి తిరుపతి, ఎండి ఖాజామీయా,అంకం భూమయ్య, ముస్కు అభిషేకర్ రెడ్డి, జంగిలి సత్యం, పొన్నం స్వామి, మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

గణపతి మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

గణేష్ ఉత్సవాల లో అధిక శబ్దం వచ్చే డీజే లకు అనుమతులు లేవు ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు.




వనపర్తి జిల్లా ప్రతినిధి బాలరాజు 11 సెప్టెంబర్ 2026 శుక్రవారం రోజు సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల పట్టణాల, గ్రామాల వినాయక మండప నిర్వాహకులు , హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు మరియు ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ముఖ్యఅతిథిగా పాల్గొని మండప నిర్వహణ కమిటీలు సభ్యులకు పలు సూచనలు చేశారు.ఈ గణపతి విగ్రహాల ఏర్పాటు ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ పట్టణాలలో గ్రామాలలో కలిసి మెలిసి సోదర భావంతో నిర్వహించుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. పోలీసు యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉందని మండప నిర్వహణ కమిటీ సభ్యులను ఉద్దేశించి పలు సూచనలు ఆన్లైన్లో వచ్చిన లింకు ద్వారా ప్రతి ఒక్క గణపతి మండపం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీని ద్వారా గణపతి నవరాత్రి ఉత్సవాలలో చేయవలసిన బందోబస్తు కేటాయించవలసిన పోలీసు సిబ్బంది నిమగ్నం ఏర్పాట్లకు మరియు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వంగా భారతదేశం విరజిల్లుతున్నదని, ఒక మతాన్ని ఇంకో మతం వారిని ఆదరించుకుంటూ పండుగలు జరుపుకునే సంస్కృతి మన వనపర్తి జిల్లాలో ఉన్నదని, అన్ని మతాల సారం ఒక్కటేనని తెలిపారు. రానున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఇతర మతస్తులను గౌరవిస్తూ తమ పండుగలు శాంతి యుతంగా జరుపుకోవాలని, ఇలాంటి సమయాల్లో ప్రజలు తమ ఐక్యతను చాటుకోవాలని వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ తెలిపారు. పండుగను ప్రజలంతా తమ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసులు అవసరం అనుకున్న ప్రదేశాల్లో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, నిర్విరామంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ, ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తామని అందుకు ప్రజలంతా పోలీసువారికి పూర్తి సహకారం అందించాలని తెలిపారు. పండుగల సమయంలో అక్కడ అక్కడ ఏమైనా చిన్న సంఘటన జరుగుతాయని తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే అలాంటి వారిపై ప్రత్యేక నిఘా పెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా వివిధ కులాల మత పెద్దలు, మసీదులు, దేవాలయాలు, చర్చ్ ల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు, ర్యాలీలు సభలు సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. ఈ సందర్భంగా మత పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో అన్ని మతాల ప్రజలు పరస్పర సహకారంతో పండుగలను నిర్వహించుకుంటూ వస్తున్నారని, ఇదే స్ఫూర్తితో గణేష్ నవరాత్రి ఉత్సవాలను కూడా సామరస్యపూర్వకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసు, రెవెన్యూ మరియు ఇతర శాఖలకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారు.గణేశుని మండపాల వద్ద 24 గంటలు కనీసం ఇద్దరు వాలంటీర్లు విగ్రహంతో పాటు ఉండాలి. జంతువులు మరియు కోతులు లోనికి రాకుండా చూసుకోవాలి.మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలి.మండపాల వద్దకు మద్యం సేవించి రాకుండా కమిటీ నిర్వాహకులు చూసుకోవాలి.మండపాల వద్ద ఎలాంటి టపాకాయలు కాల్చారాదుమండపాల నిర్వహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి వుంటుందని,ఇందుకోసం ముందుగా నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం,నిమజ్జనం తేదీ,ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్ ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారని తెలిపారు.గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి.గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు,మండపాల బాధ్యత వహించే వారి వివరాలు,ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలి.వృద్ధులు,చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్దకాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి.సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి. మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డిజేలను ఏర్పాటు చేయరాదు. గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శనను దృష్టిలో వుంచుకోని మండపాలలో భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేసుకోవాలి విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి,పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారు.ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ ,వీరారెడ్డి , వనపర్తి సీఐ, సుగంధ రత్నం, కొత్తకోట సీఐ, ఓ డి, రమేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, జిల్లాలోని ఎస్సైలు పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ మతాల కుల పెద్దలు, మరియు రాజకీయ పార్టీల నాయకులు, పెద్దలు మరియు జిల్లాలోని యువకులు కార్యాలయ సిబ్బంది పోలీసు అధికారులు, సిబ్బంది, పాత్రికేయులు పాల్గొన్నారు,






# ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులను సద్వినియోగం చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

- విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి
- ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాల అభివృద్ధికి నిధులను సమర్థవంతంగా వినియోగించాలి



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 11 : శుక్రవారం సమీకృత పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధ్యక్షతన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధుల వినియోగంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులను ఎంత మేరకు, ఏయే రంగాల్లో సమర్థవంతంగా వినియోగించవచ్చనే అంశంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాకు అందుబాటులో ఉన్న ఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులను సద్వినియోగం చేసేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా విద్యా రంగం, వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, వాటి అభివృద్ధికి సీఎస్ఆర్--సీడీ నిధులను వినియోగించేలా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతులకు సంబంధించిన అవసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.నిధులను సమర్థవంతంగా వినియోగించాలిఎన్‌టీపీసీ సీఎస్ఆర్--సీడీ నిధులు వృథా కాకుండా, నిబంధనలకు అనుగుణంగా అత్యంత సమర్థవంతంగా వినియోగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నిధుల మేరకు చేపట్టగల పనులను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలను రూపొందించి తదుపరి చర్యలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, జిల్లాలో సీఎస్ఆర్--సీడీ నిధుల ద్వారా చేపట్టే పనులు ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూరేలా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య, సీపీఓ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కిడ్నాప్, మతమార్పిడి, పెళ్లి.. పాకిస్తాన్ కోర్టు బయట హిందూ బాలికల కన్నీళ్లు!



పాకిస్తాన్‌లో మైనారిటీ హిందూ, క్రిస్టియన్ ప్రజలకు రక్షణ లేకుండా పోతోంది. ముఖ్యంగా సింధ్ ప్రావిన్స్‌లో హిందూ బాలికల అపహరణ, మతమార్పిడి. బలవంతంగా పెళ్లి చేసుకోవడం నిత్యకృత్యంగా మారుతోంది. అక్కడి పోలీస్, న్యాయ వ్యవస్థ కూడా ఈ అమ్మాయిలకు సాయం చేయడం లేదు. తాజాగా ఇద్దరు హిందూ బాలికలు తమ తల్లిదండ్రుల వద్దకు వెళ్తామని కన్నీరు పెట్టుకున్నా కూడా కోర్టు వారిని షెల్టర్ హోమ్‌కు పంపించింది. తమ కుమార్తెలను అపహరించి, ఇస్లాంలోకి మార్చి బలవంతంగా ఇద్దరు యువకులు పెళ్లి చేస్తుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.సింధ్‌లోని టాండో అల్లహ్యార్ జిల్లాకు చెందిన 13, 14 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు బాలికల్ని అమ్జద్ సోలంగి, మన్సూర్ సోలంగి అనే ఇద్దరు వ్యక్తులు వివాహం చేసుకున్నట్లు హక్కుల కార్యకర్తలు, బాధిత కుటుంబీకులు ఆరోపించారు. కిడ్నాప్ కేసులో ఇద్దరు బాలికల్ని కోర్టులో హాజరుపరిచారు. విచారణ తర్వాత తల్లిదండ్రులతో పంపించకుండా రెండు రోజుల పాటు సేఫ్ హౌజ్‌లకు తరలించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు వెలుపల బాలికలు కన్నీరు పెట్టుకుంటూ తమను ఇంటికి పంపించాలని పదేపదే వేడుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 10 రోజుల్లో ఆరుగురు హిందూ బాలికల అపహరణ..ఈ ఘటనపై చర్చ జరుగుతున్న సమయంలోనే టాండో అల్లాహ్యార్ జిల్లాలో 14 ఏళ్ల బాలిక పాన్సీ కోహ్లీ సెప్టెంబర్ 9న కిడ్నాప్‌కు గురైనట్లు హక్కుల కార్యకర్త తెలిపారు. 10 రోజుల వ్యవధిలో ఈ జిల్లాలో ఆరుగురు హిందూ మైనర్ బాలికలు అపహరణకు, మతమార్పిడికి గురైనట్లు పేర్కొన్నారు.ముఖ్యంగా కోహ్లీ, భీల్, మేఘ్వార్ వంటి అణగారిన వర్గాలకు చెందిన పేద కుటుంబాలు పోలీసు వ్యవస్థ, న్యాయ సహాయం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాల్లో తక్కువ అవకాశాలతో మరింత సున్నిత పరిస్థితుల్లో ఉన్నాయని మైనారిటీ హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. అమ్నెస్టీ ఇంటర్నేషన్ కూడా పాకిస్తాన్‌లో వందలాది మంది హిందూ బాలికలు కిడ్నాప్‌కు గురవుతున్నారని, బలవంతపు వివాహాలను ఎదుర్కొంటున్నారని చెబుతోంది.బాలికల వయసు 13, 14 ఏళు ...గా తేలితే, సింధ్ చైల్డ్ మ్యారేజెస్ రెస్ట్రెయింట్ యాక్ట్, 2013 ప్రకారం వారు పిల్లలుగా పరిగణించబడతారు. ఈ చట్టం ప్రకారం పురుషులు, మహిళలు ఇద్దరికీ వివాహ కనీస వయసు 18 సంవత్సరాలు. ఇప్పుడు వీరి వయసును నిర్ధారించాల్సి ఉంది.

# స్నేక్ రిపెల్లెంట్ స్ప్రేలు, కొన్ని మొక్కలు.. నిజంగా పాములను తరిమికొడతాయా




స్నేక్ ప్లాంట్‌గా పిలిచే మొక్కఇల్లు, తోట, వ్యవసాయ భూముల్లోకి పాములు రాకుండా అడ్డుకుంటాయని చెబుతూ ఇంటర్నెట్‌లో రకరకాల స్ప్రేలు, రసాయన పదార్థాలను విక్రయిస్తున్నారు. కానీ, అవి నిజంగా పాములను తరిమికొడతాయా శాస్త్రీయ పరిశోధనలు ఈ విషయాన్ని నిరూపించాయా "స్నేక్ రిపెల్లెంట్" అని ఇంటర్నెట్‌లో వెతికితే, "పాములను ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుకుంటాయి. ఒక నిర్దిష్ట ప్రాంతంలోకి పాములు రాకుండా చూస్తాయి" అని క్లెయిమ్ చేస్తూ విక్రయించే వివిధ ఉత్పత్తులు కనిపిస్తాయి.ఆన్‌లైన్‌లో అమ్మకానికి ఉంచిన ఆ వస్తువుల వివరాలను గమనిస్తే.. కొన్నింటిలో ఎసెన్షియల్ ఆయిల్స్, మరికొన్నింటిలో సల్ఫర్, నాఫ్తలీన్ లాంటి రసాయనాలు వాడినట్లు రాసి ఉంటుంది. తమ ఉత్పత్తుల నుంచి వచ్చే ఘాటైన వాసన కారణంగా పాములు ఆ ప్రాంతం దరిదాపుల్లోకి కూడా రావని కొన్ని సంస్థలు ప్రకటనలు ఇస్తున్నాయి.కానీ, ఒక వస్తువుకు ఘాటైన వాసన ఉండటం మాత్రమే పాములను తరిమికొడుతుందనడానికి నమ్మకమైన ఆధారం కాదని మదురైకి చెందిన 'ఊర్వనం' సంస్థ వ్యవస్థాపకుడు విశ్వనాథ్? చెబుతున్నారు.పాముల జీవనశైలి, పాము-మనిషి ఎదురుపడే పరిస్థితులపై 15 ఏళ్లకు పైగా పరిశోధనలు చేస్తున్న ఆయన, పాములను రక్షించే పనిలో ఉన్నారు.డీఆర్‌డీఓ అధ్యయనం ఏం చెబుతోంది భారతదేశంలో దీనిపై జరిగిన ముఖ్యమైన పరిశోధనల్లో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) పరిశోధకులు చేసిన అధ్యయనం కూడా ఒకటి.2012 జులై 29న 'సైంటిఫిక్ రిపోర్ట్స్' అనే జర్నల్‌లో ఇది ప్రచురితమైంది. భారతదేశంలోని ప్రధాన విషసర్పాలైన నాగుపాము, కట్లపాము, రక్తపింజర వంటి కొన్ని పాములను పారదోలుతాయని చెబుతున్న (రిపెల్లెంట్) ఉత్పత్తులను వారు పరీక్షించారు.ప్రయోగశాల వాతావరణంలో జరిగిన ఈ పరీక్షల్లో, కొన్ని ఉత్పత్తులు పాములను దరిచేరనివ్వకుండా చేశాయి. ముఖ్యంగా కొన్ని ఉత్పత్తులతో పాటు లవంగాల నూనెలో ఉండే యూజినాల్ లాంటి వాటిని పరీక్షించారు.ఇలాంటి ఉత్పత్తులను వాడినా, వాటిని పూర్తి స్థాయి భద్రతా చర్యగా గానీ పద్ధతిగా గానీ పూర్తిగా నమ్మకూడదని ఈ అధ్యయనం హెచ్చరించింది.బయటి వాతావరణంలోనూ పనిచేస్తాయాస్నేక్ రిపెల్లెంట్స్ పేరుతో విక్రయిస్తున్న ఉత్పత్తుల గురించి తలెత్తే ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే.. అవి బయటి వాతావరణంలో పనిచేస్తాయా లేదా 2008లో సరీసృపాల పరిశోధనలకు సంబంధించిన 'అప్లైడ్ హెర్పెటాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో, నాఫ్తలీన్, సల్ఫర్ (గంధకం) కలిపిన మిశ్రమాన్ని పాములపై ప్రయోగించి చూశారు.సహజమైన బయటి వాతావరణాన్ని తలపించేలా ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఈ అధ్యయనం నిర్వహించారు. ఇందులో చాలా తక్కువ పాములు మాత్రమే రసాయనాలు వాడిన ప్రాంతం వైపు వెళ్లకుండా దారి మళ్లాయి. అదే సమయంలో, ఎన్నో పాములు ఆ రసాయనాలు ఉన్న ప్రాంతాన్ని దాటుకుని వెళ్లి ఎప్పటిలాగే సాధారణంగా ప్రవర్తించాయి.పాములను ఇలాంటి 'స్నేక్ రిపెల్లెంట్' మిశ్రమాలు పూర్తిగా తరిమికొట్టలేవని పరిశోధకులు చెప్పారు.సహజ నూనెలతో తయారైన స్ప్రేలు ఇంటర్నెట్‌లో అమ్ముడవుతున్న ఎన్నో కొత్త ఉత్పత్తులను "సహజ పద్ధతిలో తయారైనవి" అని ప్రచారం చేస్తున్నారు. దాల్చినచెక్క, పుదీనా, లవంగం, దేవదారు లాంటి నూనెలు వీటిలో ఉంటున్నాయి. ఇటీవల, 'ఫ్రాంటియర్స్ ఇన్ పబ్లిక్ హెల్త్' అనే జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం, ఆఫ్రికాలో విక్రయిస్తున్న.. పాములను పారదోలే మిశ్రమ ఉత్పత్తులను పరిశీలించింది.వాటిలో చాలా ఉత్పత్తుల్లో ఎసెన్షియల్ ఆయిల్స్‌తో పాటు రకరకాల రసాయనాలు ఉన్నాయని, అయితే అవి బాగా పనిచేస్తాయనడానికి తగిన శాస్త్రీయ ఆధారాలు తక్కువగా ఉన్నాయని పరిశోధకులు చెప్పారు. బయటి వాతావరణంలో నిర్వహించిన కొన్ని పరీక్షల్లో, పరీక్షించిన ఏ ప్రోడక్ట్ మెరుగ్గా పాములను తరిమికొట్టలేకపోయిందని ఆ అధ్యయనం స్పష్టం చేసింది. ప్రతీకాత్మక చిత్రం పాములను తరిమికొట్టే మొక్కలున్నా అమెరికాలోని మేరీల్యాండ్ యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ నిపుణుల మార్గదర్శకత్వంలో ఎన్నో స్నేక్ రిపెల్లెంట్లను పరీక్షించినప్పటికీ, "ఏదీ నిలకడగా ఒకే విధమైన సామర్థ్యాన్ని చూపించలేదు" అని వారు పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలను 2021 ఏప్రిల్ 2న విడుదల చేశారు."స్నేక్ ప్లాంట్, సర్పగంధి, కలబంద లాంటి మొక్కలు పాములను పారదోలుతాయని మన గ్రామాల్లో నమ్ముతారు. కానీ, అందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారం ఇప్పటివరకు లభించలేదు. పైగా ఈ మొక్కల మధ్యే పాములు తిరగడం మేం చూశాం" అని విశ్వనాథ్ తెలిపారు."ఇళ్ల చుట్టూ పిల్లలు ఆడుకోవడం, తిరగడం రోజూ ఎక్కువగా ఉంటుంది. ఎక్కడైనా కింద పడిన బంతిని వారు తీసుకున్నప్పుడు లేదా వాళ్లంతట వాళ్లే ఏదైనా ప్రదేశాల్లో చేతులు పెట్టినప్పుడు ఆ రసాయనాలు వాళ్ల చేతులకు అంటుకోవచ్చు" అన్నారు. నేలవేము, పెద్ద నేలవేము లాంటి మొక్కలు ఉంటే పాములు రావనే సాధారణ నమ్మకం ఉన్నప్పటికీ అది నిజం కాదని 'ఊర్వనం' సంస్థ వ్యవస్థాపకుడు విశ్వనాథ్? చెప్పారు.పాములను తరిమికొట్టే స్ప్రేలతో ప్రయోజనం లేదా ఇళ్ల చుట్టూ ఇలాంటి స్ప్రేలు చల్లడం వల్ల పాములు కచ్చితంగా రావని చెప్పడానికి తగిన ఆధారాలు ఇప్పటివరకు లేవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి, ఇంటర్నెట్‌లో విక్రయిస్తున్న స్నేక్ రిపెల్లెంట్ స్ప్రేలను పాముల నుంచి రక్షించే బలమైన భద్రతా కవచంగా భావించడం తప్పుడు విధానమని ఊర్వనం సంస్థ వ్యవస్థాపకుడు విశ్వనాథ్ స్పష్టం చేస్తున్నారు.నివాస ప్రాంతాల్లో పాములతో పొంచి ఉన్న ప్రమాదాలను నివారించడానికి, "అవి ప్రవేశించే దారులను మూసివేయడం, ఇంటి చుట్టూ ఉన్న పొదలు, చెత్తను తొలగించడం, ఎలుకల లాంటి ఎర జంతువులను నియంత్రించడం లాంటి ఆచరణాత్మక చర్యలే అత్యంత నమ్మకమైన నివారణ పద్ధతులుగా ఉంటాయి" అని పాముల రక్షణ నిపుణుడు, వన్యప్రాణి ప్రేమికుడు సామ్సన్ కృపాకరన్ బీబీసీ తమిళంతో వివరించారు దీదీజసరీసృపాల ప్రకృతి, జంతు సంరక్షణ కమిటీ వ్యవస్థాపకుడు విశ్వనాథ్ ఇళ్లలోకి పాములు రాకుండా ఏం చేయాలి "గాలి కోసం వేసవిలో చాలామంది నేలపై పడుకుంటారు. ఆ సమయంలో చుట్టూ దోమతెర లాంటి రక్షణ ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి. కొన్ని పాములు తలుపుల ద్వారా లోపలికి వస్తాయి. వంటగదిలో గిన్నెలు కడిగే సింక్ పైపుల నుంచి కూడా రావచ్చు. అలా వచ్చిన కొన్ని పాములను మేం పట్టుకున్నాం. ఆ పైపులకు మూతలు పెట్టడం చాలా అవసరం" అని పాముల రక్షణ నిపుణుడు విశ్వనాథ్? బీబీసీతో చెప్పారు."ఇంటి బయట షూస్ వదిలేయకుండా, ఏదైనా మేకుకు వేలాడదీయడం మంచిది. లేదంటే వాటిలో చిన్న పాములు దూరుతాయి. ఎంత దులిపినా బయటకు రావు. చలికాలంలో కార్ల లోపలికి చేరుతాయి. తారు రోడ్లు పగటిపూట వేడిని గ్రహించి రాత్రిపూట బయటకు వదులుతాయి కాబట్టి పాములు రోడ్ల మీదే పడుకుంటాయి. అందుకే రాత్రిళ్లు టార్చ్‌లైట్ లేకుండా బయట తిరగకూడదు" అని విశ్వనాథ్? అన్నారు."ఏ కాలమైనా సరే పాములు జనావాసాల వైపు రావడం సహజమే. పాములు ఇంట్లోకి వస్తే వాటిని కొట్టడానికి గానీ, తరిమికొట్టడానికి గానీ ప్రయత్నించకూడదు. వెంటనే దగ్గర్లోని అటవీ శాఖ లేదా అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడం ఉత్తమం. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం" అని చెన్నై స్నేక్ పార్క్ నిర్వాహకుడు, సరీసృపాల పరిశోధకుడు గణేశన్ తెలిపారు.

# ఇజ్రాయెల్‌పై యుద్ధంలో ఇరాన్‌కు బిగ్ షాక్




లెబనాన్: గోటి చుట్టు రోకటి పోటులా ఇరాన్ అనుకూల ఉగ్రవాద సంస్థ హెజ్‌బొల్లాకు కోలుకోలేని బిగ్ షాక్ తగిలింది. ఇటీవల ఇజ్రాయెల్ చేపట్టిన 'ఆపరేషన్ న్యూ ఆర్డర్' లో తమ అధినేత హాసన్ నస్రల్లాను పోగొట్టుకుని తీవ్ర సంక్షోభంలో ఉన్న ఆ సంస్థకు..ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ మరో కోలుకోలేని దెబ్బకొట్టింది. దక్షిణ లెబనాన్ సరిహద్దుల్లో ఇజ్రాయెల్ ఆర్మీ సృష్టించిన భీకర 'కృత్రిమ భూకంపం' ధాటికి హెజ్‌బొల్లాకు చెందిన అత్యంత కీలకమైన వ్యూహాత్మక భూగర్భ స్థావరాలు, కమాండ్ సెంటర్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి.అంతర్జాతీయ కథనాల ప్రకారం.. దక్షిణ లెబనాన్ సరిహద్దు ప్రాంతంలో ఒక్కసారిగా భూమి తీవ్రంగా కంపించింది. రిక్టర్ స్కేలుపై 4.1 తీవ్రతతో ఈ భూప్రకంపనలు నమోదయ్యాయి. అయితే, ఇది ప్రకృతి సిద్ధంగా వచ్చిన భూకంపం కాదని, ఇజ్రాయెల్ సైన్యం జరిపిన అత్యంత భారీ భూగర్భ పేలుళ్ల వల్లే ఈ ప్రకంపనలు సంభవించాయని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వేతో పాటు అంతర్జాతీయ మీడియా సంస్థలు ధృవీకరించాయి.సరిహద్దుల్లో ఇరాన్ మద్దతు గల హెజ్‌బొల్లా నిర్మించుకున్న భారీ భూగర్భ సొరంగాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యం ఈ వినాశకర దాడి చేపట్టింది. అలీ అల్-తాహర్ పర్వత శ్రేణి సమీపంలో ఏకంగా 1,100 టన్నుల (1.1 మిలియన్ కిలోల) అత్యంత శక్తివంతమైన పేలుడు పదార్థాలను ఉపయోగించి హెజ్‌బొల్లా బంకర్లను ఒకేసారి పేల్చివేశారు.ఈ భారీ పేలుడు ధాటికి పుట్టిన షాక్‌వేవ్స్ భూమి లోపల 10 కిలోమీటర్ల లోతు వరకు ప్రయాణించడంతో, ఆ తీవ్రతకు సరిహద్దు ప్రాంతాలు దద్దరిల్లాయి. ఇరాన్ ఆర్థిక,సాంకేతిక సాయంతో గత రెండు దశాబ్దాలుగా (20 ఏళ్లుగా) హెజ్‌బొల్లా నిర్మించుకున్న దాదాపు 2 కిలోమీటర్ల పొడవైన అత్యాధునిక అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్ ఈ దాడిలో నాశనమైంది.ఇది హెజ్‌బొల్లాకు చెందిన అత్యంత కీలకమైన 'బద్ర్'ప్రాంతీయ విభాగానికి ప్రధాన కమాండ్ సెంటర్‌గా వ్యవహరిస్తోంది. ఇక్కడే భారీగా దాచి ఉంచిన క్షిపణులు, డ్రోన్లు, యాంటీ-ట్యాంక్ ఆయుధాలు, వందలాది ల్యాండ్ మైన్స్ ఈ పేలుడుతో పాటు గాల్లో కలిసిపోయాయి.భూగర్భంలో ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో పేలుడు సంభవించడంతో ఆ ప్రకంపనలు పదుల కిలోమీటర్ల దూరంలో ఉన్న లెబనాన్ నగరాల వరకు తాకాయి. ముఖ్యంగా దక్షిణ లెబనాన్‌లోని నబాటియా ప్రాంత పరిధిలో ఉన్న భవనాలు తీవ్రంగా ఊగిపోవడంతో, స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. భూగర్భంలో జరిగిన ఈ భారీ విస్ఫోటనం వల్ల స్థానికంగా భూమిపై పెద్ద ఎత్తున పగుళ్లు ఏర్పడ్డాయని, పర్యావరణానికి భారీ నష్టం వాటిల్లిందని రక్షణ నిపుణులు,శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

# "గగనతలం మూసివేతతో తీవ్ర ఉద్రిక్తత!"

ఇరు దేశాల మధ్య ముదిరిన భీకర వైరం..

నివ్వెరపోయిన అంతర్జాతీయ నేతలు..!!!



ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ, దక్షిణాసియాలోని రెండు పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఒక్కసారిగా యుద్ధ మేఘాలు కమ్ముకోవడం అంతర్జాతీయ సమాజంలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది.ఇరు దేశాల మధ్య చిరకాలంగా కొనసాగుతున్న సరిహద్దు వివాదాలు, సరిహద్దు దాటి జరుగుతున్న ఉగ్రవాద కార్యకలాపాల ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. దీంతో ఇరు దేశాలు తమ దౌత్య సంబంధాలను పూర్తిగా తెంచుకునే దిశగా అడుగులు వేశాయి. అంతేకాకుండా, పరస్పరం తమ గగనతలాన్ని (ఎయిర్‌స్పేస్) వినియోగించకుండా నిషేధం విధించి మూసివేయడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది.సరిహద్దుల్లో నిరంతరం ఉగ్రవాదుల చొరబాట్లు జరుగుతున్నాయని పాకిస్తాన్ ఆరోపిస్తుండగా, ఇటీవల ఆఫ్ఘనిస్తాన్ భూభాగంలోని సరిహద్దు ప్రాంతాలపై పాకిస్తాన్ సైన్యం జరిపిన ఆకస్మిక వైమానిక దాడులే ఈ సరికొత్త ఘర్షణకు తక్షణ కారణమయ్యాయి.ఈ వైమానిక దాడులకు ప్రతీకారంగా ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబాన్ సైన్యం కూడా పాక్ సరిహద్దు పోస్టులపై తీవ్రస్థాయిలో కాల్పులు జరిపింది. ఇరు పక్షాల ప్రతిస్పందనలతో ఆగ్రహం పెల్లుబకడంతో, రాయబార కార్యాలయాల అధికారులను వెనక్కి పిలిపించడంతో పాటు వ్యాపార, రవాణా మార్గాలను, ఎయిర్‌స్పేస్‌ను నిలిపివేసి తమ తీవ్ర శత్రుత్వాన్ని ప్రదర్శించాయి.సరిహద్దులను పంచుకునే ఈ రెండు పొరుగు దేశాల మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు ఆ ప్రాంతంలో అశాంతిని రేకెత్తించడమే కాకుండా, అమాయక ప్రజల జీవనాధారాన్ని తీవ్ర గందరగోళంలోకి నెట్టాయి. గగనతలం మూసివేత ప్రభావం అంతర్జాతీయ విమాన రాకపోకలు, వాణిజ్య నడవాలపై తీవ్రంగా పడటంతో, సరిహద్దు వెంబడి ఎప్పుడేం జరుగుతుందోనన్న యుద్ధ భయాందోళనలు నెలకొన్నాయి.అంతర్జాతీయ సమాజం మరియు ఐక్యరాజ్యసమితి రంగంలోకి దిగి ఉద్రిక్తతలను తగ్గించేందుకు సంప్రదింపులు జరుపుతున్న తరుణంలో, ఈ తీవ్ర భౌగోళిక రాజకీయ పరిణామం ప్రపంచవ్యాప్తంగా వార్తా మాధ్యమాల్లో, సోషల్ మీడియాలో దావానలంలా వైరలవుతోంది.

# కొల్హాపూర్‌కు 'మాధురి' ఏనుగు పునరాగమనం.. వంతారా కీలక ప్రకటన

**కొల్హాపూర్‌కు 'మాధురి' ఏనుగు పునరాగమనం.. వంతారా కీలక ప్రకటన**



కొల్హాపూర్‌లో 'మహాదేవి'గా భక్తులు, ప్రజల నుంచి అపారమైన ప్రేమను పొందిన 'మాధురి' ఏనుగును తిరిగి కొల్హాపూర్‌కు పంపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని గుజరాత్‌లోని వంతారా ప్రాజెక్ట్ నిర్వహణ విభాగం స్పష్టం చేసింది. హై పవర్డ్ కమిటీ (హూజ) జారీ చేసిన ఆదేశాలను పూర్తిగా గౌరవిస్తూ, మాధురి సంక్షేమం మరియు ఆరోగ్య భద్రతకు అవసరమైన అన్ని చర్యలనూ కొనసాగిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది.

## హెచ్‌పీసీ ఆదేశాల మేరకే బాధ్యతలు

2025 జులై 30న మాధురిని జామ్‌నగర్‌లోని వంతారాకు తరలించడం తమ సొంత నిర్ణయం కాదని, హై పవర్డ్ కమిటీ ఆదేశాల మేరకే స్వీకరించి అత్యుత్తమ సంరక్షణ అందించామని వంతారా స్పష్టం చేసింది. కొల్హాపూర్ ప్రజలకు ఈ ఏనుగుతో ఉన్న భావోద్వేగ అనుబంధాన్ని తాము సంపూర్ణంగా గౌరవిస్తున్నామని, ఈ విషయాన్ని 2025 ఆగస్టు 6న మహారాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, స్థానికులతో జరిపిన చర్చల సందర్భంలోనే తేల్చిచెప్పామని గుర్తుచేసింది.తాజాగా సుప్రీంకోర్టు సూచనల మేరకు అన్ని వర్గాల వాదనలను విన్న హై పవర్డ్ కమిటీ, నందనిలోని మాధురి పాత నివాస ప్రాంతాన్ని కూడా పరిశీలించింది. అనంతరం 2026 సెప్టెంబర్ 9న ఏనుగును తిరిగి కొల్హాపూర్‌కు తరలించేందుకు షరతులతో కూడిన అనుమతిని మంజూరు చేసింది.

## విధింపులు వైద్య పర్యవేక్షణ:

ఊరేగింపులపై నిషేధం: మాధురిని ఇకపై ఎలాంటి ఊరేగింపులు, పబ్లిక్ ఈవెంట్లు లేదా ఇతర కార్యక్రమాల్లో ఉపయోగించకూడదు.

## 24 గంటల సంరక్షణ:

ఏనుగుకు నిరంతర పర్యవేక్షణ మరియు ప్రతి రెండు వారాలకు ఒకసారి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించాలి. వైద్య నివేదికలు: వంతారా పశువైద్యుల బృందం ప్రతి 15 రోజులకు ఒకసారి కొల్హాపూర్‌కు వెళ్లి వైద్య పరీక్షలు చేసి, నివేదికలను అధికారులకు సమర్పిస్తుంది.

## దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి

మాధురి ఆరోగ్య పరిస్థితిపై వంతారా స్పందిస్తూ.. నిరంతర పశువైద్య సంరక్షణ ద్వారా ఏనుగు పరిస్థితిని ప్రస్తుతం స్థిరీకరించగలిగామని, అయితే దానికున్న దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు పూర్తిగా నయం కాలేదని తెలిపింది. కొల్హాపూర్‌కు వెళ్లిన తర్వాత కూడా తమ బాధ్యత ముగియదని, అవసరమైన వైద్య పరికరాలు, మందులు మరియు సహాయక సంరక్షణ సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంచుతామని పేర్కొంది.

## నందని వసతి ప్రాంతం మెరుగుదల

మాధురి నివసించే నందని ఎన్‌క్లోజర్‌ను అందుబాటులో ఉన్న వనరులతో మెరుగ్గా తీర్చిదిద్దినట్లు తెలిపింది. స్థానిక పట్టణ ప్రణాళిక పరిమితులు, ట్రస్ట్ భూమి మీదుగా వెళ్లే రహదారి కారణంగా మౌలిక సదుపాయాల విస్తరణకు స్థలం పరిమితంగా ఉందంది. రాబోయే రోజుల్లో మఠానికి అవసరమైన సాంకేతిక, మౌలిక వసతుల సహాయం అందించేందుకు, కోర్టు లేదా అధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించింది."జంతు సంక్షేమం అనేది కేవలం భావోద్వేగాలకు పరిమితం కాకూడదు. వాస్తవాలు, పశువైద్య శాస్త్రం, చట్టపరమైన నిబంధనలను గౌరవిస్తూ ముందుకు సాగడమే నిజమైన సంరక్షణ" అని వంతారా పేర్కొంది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు, బాంబే హైకోర్టు, హెచ్‌పీసీ, మహారాష్ట్ర-గుజరాత్ ప్రభుత్వాలు, మఠం నిర్వాహకులు, ఇండియా మరియు కొల్హాపూర్ ప్రజలకు వంతారా యాజమాన్యం ధన్యవాదాలు తెలిపింది.

# భారత్ అమ్ములపొదిలో 190 అణు వార్‌హెడ్లు.. తయారీ దశలో మరో 35



గాలి, నేల, సముద్రం ఈ మూడు మార్గాల ద్వారా ఒకేసారి అణ్వాయుధాలను ప్రయోగించగల 'న్యూక్లియర్ ట్రయాడ్' వ్యవస్థలను భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చేస్తోందని హాన్స్ క్రిస్టెన్సెన్ అన్నారు. 2026 ప్రారంభం నాటికి భారత్ వద్ద సుమారు 730 కిలోల వెపన్- గ్రేడ్ ప్లుటోనియం ఉన్నట్లు అంచనా వేశారు. ఒక్కో వార్‌హెడ్‌కు 4 కిలోల ప్లుటోనియం అవసరం అనుకున్నా ఈ నిల్వలు 140 నుంచి 225 వార్‌హెడ్ల తయారీకి సరిపోతాయని తెలిపారు. అయితే భారత్ తన వద్ద ఉన్న ప్లుటోనియం మొత్తాన్ని ఆయుధాల తయారీకే వాడకపోవచ్చని, కొంత రిజర్వ్‌గా ఉంచుకునే అవకాశం ఉందని తెలిపారు.

## భారత్ వద్ద ప్లుటోనియం నిల్వలు ఎంత

2026 ప్రారంభం నాటికి భారత్ వద్ద సుమారు 730 కిలోల వెపన్-గ్రేడ్ ప్లుటోనియం ఉన్నట్లు అంచనా వేశారు. ఒక్కో వార్‌హెడ్ తయారీకి సుమారు 4 కిలోల ప్లుటోనియం అవసరమని భావిస్తే, ఈ నిల్వలు భవిష్యత్తులో 140 నుండి 225 అణు వార్‌హెడ్‌లను తయారు చేయడానికి సరిపోతాయి. అయితే, భారత్ తన వద్ద ఉన్న మొత్తం ప్లుటోనియాన్ని కేవలం ఆయుధాల తయారీకే పూర్తిగా ఉపయోగించకపోవచ్చని, భవిష్యత్తు అవసరాల కోసం కొంత భాగాన్ని రిజర్వ్‌గా ఉంచుకునే అవకాశం ఉందని ఆయన విశ్లేషించారు. ఆయుధ సంపత్తిని క్రమంగా పెంచుకుంటున్నప్పటికీ, భారత్ తన ప్రాథమిక విదేశాంగ, రక్షణ విధానాలకు మాత్రం ఎప్పుడూ కట్టుబడి ఉంది. 1998లో నిర్వహించిన పోఖ్రాన్-అణుపరీక్షల తర్వాత భారత్ అధికారికంగా 'నో ఫస్ట్ యూజ్' (ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుగా అణ్వాయుధాలను ప్రయోగించబోం) సిద్ధాంతాన్ని ప్రకటించింది. తమ వద్ద ఉన్న అణ్వాయుధాలు కేవలం శత్రు దేశాల దాడులను నిలువరించడానికి మాత్రమే ఉపయోగపడతాయని భారత ప్రభుత్వం పార్లమెంటు వేదికగా అనేకసార్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం మరికొన్ని నూతన క్షిపణి వ్యవస్థలు వివిధ దశల్లో అభివృద్ధిలో ఉన్నందున, రాబోయే రోజుల్లో భారత్ అణ్వాయుధాల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని రక్షణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## అణ్వాయుధాలు ఉన్న దేశాలు తొమ్మిది

అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, యుద్ధ వాతావరణం కారణంగా ఇటీవలి కాలంలో చాలా దేశాలు తమ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్నాయి. ప్రధాన అణు శక్తి దేశాలన్నీ తమ ఆయుధ సంపత్తిని, క్షిపణి వ్యవస్థలను ఆధునీకరించుకునే పనిలో నిమగ్నమయ్యాయి. అత్యధిక సంఖ్యలో అణ్వాయుధాలు కలిగి ఉన్న దేశాల జాబితాలో అమెరికా, రష్యా తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాలు కలిగి ఉన్న దేశాలు మొత్తం తొమ్మిది మాత్రమే ఉన్నాయి. ఈ తొమ్మిది దేశాల వద్ద కలిపి 12 వేలకు పైగా అణ్వాయుధాలు అందుబాటులో ఉన్నాయి. కేవలం ఏడాది వ్యవధిలో భారత్ మరో 10 వార్‌హెడ్లను అదనంగా సమకూర్చుకుని తన ఆయుధాగారాన్ని బలోపేతం చేసుకుంది. చైనా విషయానికి వస్తే, ఆ దేశం వద్ద ఏకంగా 620 అణ్వాయుధాలు ఉన్నట్లు సిప్రి నివేదికలో వెల్లడించింది.

వార్త
జాతీయ తెలుగు దినపత్రిక

## 22ఏ ఒక దుర్మార్గం.. 30 వేల ఎకరాలపై సీఎం కన్ను : హరీష్ రావు



దిశ, వెబ్‌డెస్క్: 22ఏ పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో చేసిన దుర్మార్గమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు.తెలంగాణ భవన్లో శుక్రవారం 22ఏ బాధితులతో బీఆర్ఎస్ నిర్వహించిన సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. భూ భారతి పేరుతో.. భూ హారతికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ రెడ్డి భూమిని కాజేయడమే పనిగా పాలన చేస్తున్నారని, 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ భూములపై కన్నేశారని ఆరోపించారు.భూ సమస్యలను ఫోన్ చేస్తే పరిష్కరిస్తామని చెప్పారు కానీ.. ఫోన్ కాదు కదా.. డైరెక్ట్ గా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డినే కలిసినా పరిష్కారం దొరకలేదన్నారు. హైడ్రా పేరుతో.. పేదల ఇళ్లను కూల్చుతున్నవారికి బడా బాబుల నివాసాలు కనిపించవన్నారు. పొంగులేటికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ నుంచి సీఎం ఇంటిని తొలగించినపుడు.. సామాన్యుల ఇళ్లను ఎందుకు లిస్టు నుంచి తీయడం లేదని ప్రశ్నించారు. ప్రజల ఆస్తుల్ని వెంటనే ఆ లిస్టు నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిషేధిత లిస్టు నుంచి ప్రజల ఆస్తుల్ని తొలగించేంతవరకూ బీఆర్ఎస్ పోరాటం చేస్తూనే ఉంటుందని హరీష్ రావు స్పష్టం చేశారు.

## ‘ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపండి’.. పుతిన్‌తో ప్రధాని మోదీ




న్యూఢిల్లీ: ఉక్రెయిన్ సంక్షోభానికి దౌత్యపరమైన చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని భారత ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిపిన ద్వైపాక్షిక సమావేశంలో ప్రధాని మోదీ యుద్ధాన్ని తక్షణమే ఆపి, శాంతి మార్గాన్ని ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇరు దేశాల మధ్య శాంతిని పునరుద్ధరించేందుకు భారత్ తన వంతు సహాయసహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు విచ్చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఢిల్లీలోని ‘భారత్ మండపం’ వేదికగా ఇరు నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రష్యన్ భాషలోకి అనువదించిన ప్రముఖ తమిళ ప్రాచీన కావ్యమైన ‘తిరుక్కురళ్’ ప్రతిని పుతిన్‌కు ప్రత్యేక బహుమతిగా అందజేశారు. దాదాపు రెండు వేల ఏళ్ల నాటి ఈ గ్రంథంలోని మానవతా విలువలను మోదీ ఈ సందర్భంగా పుతిన్‌కు వివరించారు.రాజకీయ, ఆర్థిక, రక్షణ, ఇంధన, అంతరిక్ష రంగాల బలోపేతంపై ఇరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు.రష్యాలో జరగబోయే 24వ ఇండో-రష్యా వార్షిక శిఖరాగ్ర సమ్మిట్‌కు హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీని అధ్యక్షుడు పుతిన్ అధికారికంగా ఆహ్వానించగా.. ఆయన ఆ ఆహ్వానాన్ని స్వీకరించారు. దీనికి సంబంధించిన తుది తేదీలను దౌత్య అధికారులు త్వరలోనే ఖరారు చేయనున్నారు.

## నవరాత్రుల్లో ముహూర్తం.. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై కేంద్రం కసరత్తు!



నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ(డిలిమిటేషన్) బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను అధికారికంగా వాయిదా వేయలేదు. దీని ఫలితంగా ప్రభుత్వం ప్రత్యేక సమావేశాలను పిలిచే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ బిల్లులపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, ఇప్పటి వరకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు సంబంధించి కేంద్రం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. బ్రిక్స్ సమావేశాల అనంతరం ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నవరాత్రుల సమయంలో పార్లమెంట్ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బ్రిక్స్ సమావేశాల తర్వాత స్పెషల్ సెషన్ ఏర్పాటు చేయాలా వద్దా. అనే దానిపై కేంద్రం తన నిర్ణయాన్ని వెలువరించవచ్చు.ఇదిలా ఉంటే, వర్షకాల సమావేశాలు ముగిసి 29 రోజులు గడిచినా, సభను వాయిదా వేయకపోవడంపై కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ప్రశ్నించారు. ప్రభుత్వం తన సొంత రికార్డును తానే బద్ధలు కొడుతుందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాన్ని భయపెట్టాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని, కాని అది జరగలేదని అన్నారు. ఈ వర్షాకాల సమావేశాలో గందరగోళం నెలకొంది. రోజుకు ఆరు గంటల చొప్పున సమావేశాలు జరుగుతాయని భావిస్తే, 15 రోజుల్లో 90 గంటలు పనిచేయాల్సి వస్తుంది. అయితే, ఈ సమావేశాల్లో లోక్‌సభ కేవలం 15 గంటల 36 నిమిషాలు, రాజ్యసభ 15 రోజుల్లో 24 గంటల 21 నిమిషాలు మాత్రమే జరిగింది. జంతర్ మంతర్ నిరసనలు, విద్యార్థుల సమస్యలు, విద్యార్థులపై పోలీసులు బలప్రయోగంపై కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్షాలు సభలో నిరసన తెలియజేశాయి.

## వినాయక నిమజ్జనంలో ఆంక్షలు సీఐ రాంబాబు మార్గదర్శకాలు!




వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని బాపట్ల పట్టణ సీఐ రాంబాబు కోరారు.ముందుగా జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, మండపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహ కమిటీ సభ్యుల జాబితాను పోలీసులకు అందజేయాలని తెలిపారు. లైటింగ్ వైరింగ్‌లో ఎలాంటి అతుకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతులు కూడా తప్పనిసరిగా పొందాలని చెప్పారు.మండపాల్లో మైక్ వినియోగానికి అనుమతి తీసుకోవాలని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. కమిటీ జాబితాలోని సభ్యుల్లో ఎవరో ఒకరు ఎల్లప్పుడూ మండపం వద్ద ఉండేలా చూసుకోవాలని, విలువైన వస్తువులను మండపాల్లో ఉంచరాదన్నారు.విగ్రహాల వద్ద అశ్లీల నృత్యాలు, పాటలు నిర్వహించరాదని, మద్యం సేవించి మండపాల వద్దకు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు.నిమజ్జనంలో అప్రమత్తత:వినాయక విగ్రహాల నిమజ్జనానికి చిన్న పిల్లలను తీసుకెళ్లరాదని సీఐ సూచించారు. నిమజ్జనం సమయంలో రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించరాదన్నారు. మండపాల వద్ద ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సీఐ రాంబాబు కోరారు. విఘ్నేశ్వరుని చల్లని చూపు జిల్లా ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## హైదరాబాద్‌లో మరోసారి ఈడీ సోదాలు..

### గ్రూప్‌పై సోదాలు.. హైదరాబాద్‌లో మరోసారి ఈడీ సోదాలు కలకలం రేపుతున్నాయి.




గ్రూప్‌కు సంబంధించిన ప్రాంగణాల్లో ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కోల్‌కతాలో నమోదైన ఓ కేసు దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కోల్‌కతా నుంచి వచ్చిన ప్రత్యేక ఈడీ బృందాలు హైదరాబాద్‌లోని ాావీ=కు సంబంధించిన ఆస్తులు, కార్యాలయాలు, ఇతర ప్రాంగణాల్లో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, జార్ఖండ్, కోల్‌కతాలోనూ ఈడీ సోదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

### యజమాని ఇంట్లో లగ్జరీ కార్ల కలకలం

ఈ సోదాల్లో ాావీ= యజమాని ఏ. మహేష్ రెడ్డి ఇంటి నుంచి భారీగా లగ్జరీ వాహనాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మొత్తం 11 ఖరీదైన కార్లను సీజ్ చేసినట్లు తెలుస్తోంది. వీటిలో అత్యంత ఖరీదైన ప్రీమియం కార్లు ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### మేబ్యాక్ నుంచి ఫెరారీ వరకు.. 11 కార్లు

ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం అందుతున్న వాహనాల్లో మెర్సిడెస్-మేబ్యాక్ 580, లెక్సస్ ాశ 500ఎ, లంబోర్ఘిని, నిస్సాన్ ఫెరారీ 488 ఫెరారీ 812 కాంపిటిజియోన్ ఉన్నాయి. వీటితో పాటు లెక్సస్ ావీ350ష్ట ాాఔణ, టయోటా ఇన్నోవా క్రిస్టా ్గశ ఎజుఎ, టయోటా ల్యాండ్ క్రూయిజర్ ఎ8, టయోటా ల్యాండ్ క్రూయిజర్ ్గశ, దీవీఔ వీ వాహనాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఒకే చోట మేబ్యాక్, లెక్సస్, లంబోర్ఘిని, నిస్సాన్, ఫెరారీ, టయోటా, బీఎండబ్ల్యూ వంటి బ్రాండ్లకు చెందిన ఖరీదైన వాహనాలు ఉండటం ఈ సోదాల్లో ఆసక్తికర అంశంగా మారింది. ముఖ్యంగా ఫెరారీకి చెందిన రెండు మోడళ్లు, లంబోర్ఘిని, నిస్సాన్ మేబ్యాక్ వంటి కార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు వస్తున్న సమాచారం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. కేసుతో లింకులు ఉన్నాయా ప్రస్తుతం జరుగుతున్న ఈడీ సోదాలు సంబంధించిన కేసు దర్యాప్తుతో అనుసంధానమై ఉన్నట్లు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. కోల్‌కతా ఈడీ యూనిట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ాావీ=కు సంబంధించిన ప్రాంగణాల్లో ఈ తనిఖీలు జరుగుతున్నట్లు సమాచారం. సోదాల్లో లభించిన పత్రాలు, ఆస్తులు, వాహనాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. 11 లగ్జరీ వాహనాలను ఎందుకు స్వాధీనం చేసుకున్నారు వాటి కొనుగోలుకు ఉపయోగించిన నిధుల మూలం ఏమిటి? వాటికి దర్యాప్తులోని ఆర్థిక లావాదేవీలతో ఏమైనా సంబంధం ఉందా అనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే ఈ వివరాలపై ఈడీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

### 2022లోన పై ఈడీ సోదాలు

ాావీ=కు సంబంధించిన ప్రాంగణాల్లో ఈడీ సోదాలు జరగడం ఇదే తొలిసారి కాదని తెలుస్తోంది. 2022 ఫిబ్రవరిలో హైదరాబాద్‌లోని ాావీ= మైనింగ్ లిమిటెడ్ కార్యాలయంపై ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. అప్పట్లో జమ్మూకశ్మీర్‌లో 2010లో నమోదైన ఓ కేసు దర్యాప్తులో భాగంగా ఈ తనిఖీలు జరిగినట్లు సమాచారం. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కమలాపురి కాలనీలో ాావీ= మైనింగ్ కార్యాలయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కంపెనీని ఏ. మహేష్ రెడ్డి ప్రమోట్ చేస్తున్నట్లు అప్పటి వివరాలు పేర్కొన్నాయి. ఆయన ాావీ= ఇండియా, ఆస్కాట్ బిల్డర్స్ సహా పలు సంస్థలతో అనుబంధం కలిగి ఉన్నట్లు సమాచారం. 2010లో జరిగినట్లు చెబుతున్న నిధుల బదిలీలు, అప్పటి జమ్మూకశ్మీర్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన అధికారుల పాత్రకు సంబంధించిన అంశాలపై ఆ దర్యాప్తు సాగినట్లు తెలుస్తోంది. దాదాపు రూ.60 కోట్ల విలువైన ఆర్థిక లావాదేవీలను దర్యాప్తు సంస్థ పరిశీలించినట్లు అప్పటి సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న తాజా సోదాల్లో ఎలాంటి కీలక పత్రాలు, ఆస్తులు లేదా ఆర్థిక లావాదేవీల వివరాలు బయటపడ్డాయన్నది ఈడీ అధికారిక ప్రకటన తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా 11 లగ్జరీ కార్ల స్వాధీనం అంశంపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది.

## బంగారంపై పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభం.. రూ.1 లక్షకు రూ.3.04 లక్షలు!



సావరిన్ గోల్డ్ బాండ్స్ లో పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభం వచ్చింది. 2020-21 ావతీఅవం పెట్టుబడిదారులకు దాదాపు 204 శాతం క్యాపిటల్ గెయిన్ లభించింది.ఈ సిరీస్‌కు సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ ధరను గ్రాముకు రూ.15,384గా నిర్ణయించింది.అంటే 2020లో ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.5,067 ధరకు ఒక గ్రాము సావరిన్ గోల్డ్ బాండ్స్ కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురిసింది. ఇప్పుడు దాని విలువ ఏకంగా 3 రెట్లకు పైగా పెరిగింది. ఉదాహరణకు, అప్పట్లో మీరు రూ.1 లక్ష పెట్టుబడి పెట్టినట్లయితే ప్రస్తుతం దాని రిడెంప్షన్ విలువ సుమారు రూ.3.04 లక్షలు అవుతుంది. ఇందులో బాండ్స్ ద్వారా వచ్చిన వడ్డీని కలపలేదు.

### రూ.5,067 నుంచి రూ.15,384కు..

సావరిన్‌గోల్డ్ బాండ్స్ 2020-21 ావతీఅవం ఎ×ని 8 సెప్టెంబర్ 2020న జారీ చేశారు. దీని అసలు ఇష్యూ ధర గ్రాముకు రూ.5,117గా ఉంది. అయితే ఆన్‌లైన్‌లో డిజిటల్ పేమెంట్ చేసిన వారికి గ్రాముపై రూ.50 డిస్కౌంట్ లభించింది. దీంతో వారి ప్రభావవంతమైన కొనుగోలు ధర రూ.5,067గా ఉంది. ఇప్పుడు ఆర్బీఐ నిర్ణయించిన ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ ధర గ్రాముకు రూ.15,384. అంటే ఒక్క గ్రాముపై రూ.10,317 విలువ పెరిగింది.

### రూ.1,00,000 ఐ (రూ.15,384

### రూ.5,067) = సుమారు రూ.3,03,612

అంటే రూ.1 లక్ష పెట్టుబడి సుమారు రూ.3.04 లక్షలకు పెరిగినట్లు లెక్క. ఇది దాదాపు 203.6 శాతం క్యాపిటల్ గెయిన్.

### 204% రిటర్న్‌తో పాటు 2.5% వడ్డీ

పెట్టుబడి పెట్టిన వారికి కేవలం బంగారం ధర పెరగడం వల్లే లాభం రాలేదు. ఈ బాండ్లపై ఏటా 2.5 శాతం వడ్డీ కూడా లభిస్తుంది. ఈ వడ్డీని సాధారణంగా ఆరు నెలలకు ఒకసారి చెల్లిస్తారు. ఉదాహరణకు రూ.1 లక్ష విలువైన ఎస్‌జీబీ కొనుగోలు చేసిన పెట్టుబడిదారుడికి సంవత్సరానికి సుమారు రూ.2,500 వడ్డీ లభిస్తుంది. ఆరు సంవత్సరాల పాటు అదే పెట్టుబడిని కొనసాగించినట్లయితే, సుమారు రూ.15,000 వడ్డీ అవుతుంది. అయితే వాస్తవ వడ్డీ మొత్తం పెట్టుబడి వివరాలు, చెల్లింపు తేదీలపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల 204 శాతం క్యాపిటల్ గెయిన్ మాత్రమే కాకుండా, పెట్టుబడిదారులకు వడ్డీ ఆదాయం కూడా అదనంగా వచ్చింది.

### రిడెంప్షన్ ధర ఎలా నిర్ణయించింది

సావరిన్ గోల్డ్ బాండ్స్ ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ ధరను రిజర్వ్ బ్యాంకు నేరుగా నిర్ణయించదు. నిర్ణీత విధానం ప్రకారం 999 స్వచ్ఛత కలిగిన బంగారం గత మూడు పని దినాల ముగింపు ధరల సగటు ఆధారంగా రిడెంప్షన్ ధరను నిర్ణయిస్తారు. ఇందుకోసం ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (×దీజూ) ప్రచురించే బంగారం ధరలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ సిరీస్‌కు 8 సెప్టెంబర్ 2026 రిడెంప్షన్‌ను పరిగణనలోకి తీసుకుని, సెప్టెంబర్ 3, 4, 7 తేదీల్లోని బంగారం ధరలను ఆధారంగా చేసుకున్నారు. ఆ లెక్క ప్రకారం రిడెంప్షన్ ధరను రూ.15,384 గ్రాముగా నిర్ణయించారు.

### ఐదేళ్ల తర్వాత ముందుగానే డబ్బులు తీసుకోవచ్చు

సావరిన్ గోల్డ్ బాండ్ సాధారణ మెచ్యూరిటీ కాలం 8 సంవత్సరాలు. అయితే పెట్టుబడిదారులకు ఐదేళ్లు పూర్తయిన తర్వాత నిర్దిష్ట వడ్డీ చెల్లింపు తేదీల్లో ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ా+దీ 2020-21 ావతీఅవం ఎ×ని 8 సెప్టెంబర్ 2020న జారీ చేశారు. దీంతో 8 సెప్టెంబర్ 2026 నుంచి ఈ సిరీస్‌లో ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ అవకాశం వచ్చింది. ఈ సిరీస్ అసలు మెచ్యూరిటీ తేదీ 8 సెప్టెంబర్ 2028. అంటే ముందుగానే రిడీమ్ చేసుకునే పెట్టుబడిదారులు మెచ్యూరిటీకి దాదాపు రెండేళ్ల ముందే బయటకు రావచ్చు. గమనిక: రూ.3.04 లక్షల లెక్కలో 204% క్యాపిటల్ గెయిన్ మాత్రమే పరిగణించారు. పెట్టుబడిదారులకు ఇప్పటికే చెల్లించిన 2.5% వార్షిక వడ్డీ ఇందులో కలపలేదు. అలాగే పన్ను నిబంధనలు రిడెంప్షన్ విధానం, కొనుగోలు సమయం వంటి అంశాలపై ఆధారపడవచ్చు.

## శతాబ్దం నాటి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు!

రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో అనేక భూములు వివాదాల్లోకి వెళ్లాయని పేర్కొన్న సీఎం.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. శతాబ్దం కాలంగా పరిష్కారం కాని భూ సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామని చెప్పారు.రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజు సమావేశంలో రెవెన్యూ, నైపుణ్యాభివృద్ధి, విద్య, వైద్యం, పురపాలక, విద్యుత్ తదితర అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు వివిధ జిల్లాల్లో 22ఏ జాబితాకు సంబంధించిన 232 అంశాలను పరిష్కరించామని.. వీటి విలువ సుమారు రూ.5 వేల కోట్లు ఉంటుందని సీఎం వెల్లడించారు. మొత్తంగా సుదీర్ఘకాలంగా వివాదంలో ఉన్న 31 వేల ఎకరాల భూములకు విముక్తి కల్పించామని తెలిపారు.

120 ఏళ్ల నాటి సమస్యకూ పరిష్కారం

భూ సమస్యల పరిష్కారంలో అధికారుల చొరవతో పాటు ప్రజల్లో నమ్మకం పెంచేలా చర్యలు ఉండాలని చంద్రబాబు సూచించారు. అంబాజీపేటలో గ్రౌండ్ రెంట్ భూములకు సంబంధించిన సమస్య 120 ఏళ్ల నాటిదని.. అలాంటి సమస్యను కూడా పరిష్కరించగలిగామని చెప్పారు. దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపితే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందని అన్నారు.

భూ వివాదాల పరిష్కారంలో ఎక్కడా అవినీతికి తావు ఉండకూడదని సీఎం స్పష్టం చేశారు. అధికారులు, మంత్రులు పరిష్కరించిన సమస్యలను ప్రజలకు వివరించాలని సూచించారు. రీసర్వే పూర్తయిన భూములకు బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ద్వారా భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నవంబర్ 1 నుంచి రియల్‌టైమ్‌లో ఇంటిగ్రేషన్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పరిశ్రమలకు తగ్గట్టుగా యువతకు నైపుణ్యాలు

రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు చెప్పారు. పరిశ్రమలు వస్తున్నాయి.. ఉద్యోగాలు వస్తాయనే ఆశ యువతలో ఉందని, అయితే ఆ ఉద్యోగాలను పొందే స్థాయిలో వారికి నైపుణ్యాలు ఉండాలని అన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి అనేది ఒకసారి నిర్వహించే కార్యక్రమం కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని స్పష్టం చేశారు.

పీఎం సేతు కార్యక్రమాన్ని విశాఖపట్నంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించి యువతకు మరిన్ని నైపుణ్యాలు అందించాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల నుంచి వచ్చే సీఎస్ఆర్ నిధులను కూడా నైపుణ్యాభివృద్ధికి వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమల్లో నైపుణ్యం కలిగిన స్థానిక యువతకే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు దక్కేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు.

నియోజకవర్గాల వారీగా జాబ్ ఫెయిర్లు

యువతకు ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడానికి నియోజకవర్గాల వారీగా జాబ్ ఫెయిర్లు నిర్వహించాలని సీఎం సూచించారు. ఇప్పటి వరకు 4.98 లక్షల మంది యువత నైపుణ్య పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై యువతతో పాటు తల్లిదండ్రులు, ప్రజల్లోనూ విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు.స్థానిక యువతకు ఉద్యోగాలు రావాలంటే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను ముందుగానే గుర్తించి శిక్షణ ఇవ్వాలని సీఎం అన్నారు. ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలను పరిశ్రమలతో అనుసంధానం చేసి అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కూడా నైపుణ్య శిక్షణ అందించాలని ఆదేశించారు.

2027 నాటికి వందశాతం అక్షరాస్యత

రాష్ట్రంలో 2027 నాటికి అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా వందశాతం అక్షరాస్యత సాధించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సీఎం తెలిపారు. ఏపీని లిటరేట్, లెర్న్ స్టేట్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. విద్యా రంగంలో మౌలిక వసతులతో పాటు విద్యార్థుల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.స్కూల్ బిల్డింగ్ సేఫ్టీపై ఆడిటింగ్ నిర్వహించి ప్రమాదకరంగా ఉన్న భవనాలను గుర్తించాలని.. అవసరమైన మరమ్మతులు చేపట్టి పాఠశాల భవనాలను సురక్షితంగా మార్చాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు అందేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని సీఎం అన్నారు.

ఆరోగ్య సేవల్లో టెక్నాలజీ వినియోగం

ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశమని చంద్రబాబు చెప్పారు. ప్రతి నెలా ఒక రోజు సంజీవని కార్యక్రమం ద్వారా వైద్యారోగ్య సేవలను క్షేత్రస్థాయికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. వైద్య సేవల్లో టెక్నాలజీని మరింతగా అనుసంధానం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.ప్రాథమిక స్థాయిలోనే ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని అన్నారు.

గుంటూరుకు స్వచ్ఛవాయు సర్వేక్షణ్‌లో రెండో స్థానం

పర్యావరణ పరిరక్షణలో ఏపీ నగరాలు మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. స్వచ్ఛవాయు సర్వేక్షణ్‌లో గుంటూరు జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. నేషనల్ క్లీన్ ఎయిర్ సిటీస్‌గా గుంటూరు, విజయవాడలోని వార్డులకు అవార్డులు లభించాయని చెప్పారు.ఈ ఏడాది రాష్ట్రంలోని నగరాలు జాతీయ స్థాయిలో ఐదు అవార్డులు సాధించాయని, రూ.1.05 కోట్ల నగదు ప్రోత్సాహకాలు కూడా దక్కాయని సీఎం తెలిపారు. గుంటూరు, ఏలూరు, విజయనగరం, విజయవాడ, నెల్లూరు, శ్రీకాకుళం, చిత్తూరు నగరాలు అత్యుత్తమ పనితీరు కనబరిచాయని పేర్కొన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు స్థానిక సంస్థలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

విద్యుత్ డిమాండ్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తి మార్గాలపై దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు. జిల్లా కలెక్టర్లు పీఎం సూర్యఘర్ పథకాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు.ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్ల ఏర్పాటును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సీఎం చెప్పారు. ఎంత ఎక్కువగా సోలార్ ఇన్‌స్టలేషన్లు జరిగితే అంతగా విద్యుత్ ఉత్పత్తిపై ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద వ్యవసాయ కనెక్షన్లకు కూడా సౌరవిద్యుత్ ఏర్పాటు చేయాలని సూచించారు.

28 జిల్లాల్లో 47 మెగావాట్ల సోలార్

రాష్ట్రంలోని పాఠశాల భవనాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. 28 జిల్లాల్లోని 2,932 భవనాలపై 47 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

## ఆధ్యాత్మిక చింతన కలిగిస్తున్న దేవతామూర్తుల విగ్రహాలు

### ధర్మల్ కేంద్రం ఎ. ఇ. పవన్ కుమార్



హైదరాబాదు,శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి :నిజాంపేట్ శ్రీ భ్రమరాంబా సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో పలు దేవతా విగ్రహాలు మంచి ఆధ్యాత్మిక చింతన కలిగిస్తున్నాయని కడప జిల్లా రాయలసీమ థర్మల్ విద్యుత్ తాప కేంద్రం (ఆర్.టి.పి.పి.) ఎ. ఇ. ఆరిమండ్ల పవన్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఉదయం ఆయన సతీమణి శ్రీవాణి శుక్రవారం ఉదయం శ్రీ భ్రమరాంబా సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో స్వామివారికి అభిషేకం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇక్కడ వేంచేసియున్న రేణుకా ఎల్లమ్మ, దత్తాత్రేయ, దక్షిణా మూర్తి, కాలభైరవ స్వామి వారిని దర్శించారు. ఆలయ స్వాములు వారికి శాలువా కప్పి వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అకౌంటెంట్స్ చందా మల్లేశం, బ్రహ్మదేవర ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అమావాస్య రోజున అష్ట భైరవులను ఆరాధిస్తే అరిష్టాలు తొలగిపోతాయి.... ఎస్ ఎస్ ఆర్ ఆంజనేయులు



హైదరాబాదు,శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధిఈ రోజు శుక్రవారం అమావాస్య పర్వదినం సందర్భంగా నిజాంపేట్ లో శ్రీ భ్రమరాంభ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో వేంచేసియున్నశ్రీ కాలభైరవ స్వామికి భక్తులువిశేషంగా పూజలు నిర్వహించారు. గుమ్మడి కాయలు కోసి వాటిలో " గండదీపాలు" వెలిగించారు.గండ దీపాలు వెలిగిస్తే అనుకోని ప్రమాదాలు, వాహన గండాలు జరగకుండా కాలభైరవ స్వామి రక్షిస్తాడని భక్తుల విశ్వాసం. శుక్రవారం ఉదయం, సాయంత్రం ప్రదోష కాలంలో కూడా విశేషంగా భక్తులు కాలభైరవ స్వామికి పూజలు నిర్వహించారు. కాలభైరవ స్వామికి గారెల మాలలు మెడలో వేశారు. కాలభైరవ స్వామిని ఆరాధిస్తేఅనుకోని ప్రమాదాలు, వాహన గండాలు, బంధు ఘోష, జన ఘోష, నవగ్రహ దోష నివారణ జరుగుతుందని కాలభైరవ స్వామి రక్షిస్తాడని భక్తుల విశ్వాసం. ఈ ఆలయంలో క్షేత్రపాలకుడు కాలభైరవ స్వామి.

## పర్యావరణాన్ని కాపాడటం కోసం వెలుగు ఫౌండేషన్ మట్టి విగ్రహాలు పంపిణీ...... కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎం. శ్యామ్ మనోహర్



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎం. శ్యామ్ మనోహర్ అన్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను శుక్రవారం కేడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో సీఈవో ఎం. శ్యామ్ మనోహర్, బ్యాంకు అధికారులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీఈవో ఎం. శ్యామ్ మనోహర్ మాట్లాడుతూ.. మట్టి వినాయకుడిని పూజించడం అంటే ప్రకృతిని పూజించడంతో సమానమని అన్నారు. మనకు జీవనాధారమైన ప్రకృతిని పరిరక్షించుకునే సందేశాన్ని వినాయక చవితి పండుగ అందిస్తుందని తెలిపారు. వినాయక చవితి పండుగ ప్రకృతితో ముడిపడి ఉందని, మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించినవారవుతారని పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వెలుగు ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమని శ్యామ్ మనోహర్ ప్రశంసించారు.వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మచిలీపట్నం నగరంలోని ప్రధాన కూడళ్లలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రత్యేకంగా మట్టి వినాయక విగ్రహాల్లో విత్తనాలను కూడా ఉంచుతున్నామని చెప్పారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసిన అనంతరం ఆ మట్టిని ఇంటి ఆవరణలో లేదా పెరటిలో వినియోగిస్తే అందులోని విత్తనాల ద్వారా మొక్కలు మొలిచేలా ఈ విగ్రహాలను రూపొందిస్తున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎం. శ్యామ్ మనోహర్కు మట్టి వినాయక ప్రతిమను అందజేశారు.ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్లు పి.జె.ఎస్. ప్రభాకర్, పి. వరలక్ష్మి, సి.హెచ్. రాంబాబు, వెలుగు ఫౌండేషన్ ఉపాధ్యక్షులు రేపల్లె వెంకట వీర వసంతరావు, ఫౌండేషన్ సభ్యులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాఘవేంద్ర హైట్స్ లో ఘనంగా వినాయకచవితి రాటా పూజ







ఉయ్యూరు,శ్రీ వార్త న్యూస్ :వినాయకచవితి వేడుకలకు ముందుగా నిర్వహించే సంప్రదాయ రాటా కార్యక్రమం ఉయ్యూరులోని రాఘవేంద్ర హైట్స్ అపార్ట్ మెంట్ లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. మహిళా భక్తుల ఆధ్వర్యంలో పందిరి గుంజకు పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేసి, శుభ ముహూర్తాన నిలబెట్టారు.వినాయకచవితి పండుగను పురస్కరించుకుని అపార్ట్ మెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపానికి అంకురార్పణగా ఈ పూజ నిర్వహించారు. స్వామివారికి ఇష్టమైన ఉండ్రాళ్లను నైవేద్యంగా సమర్పించి, రాబోయే తొమ్మిది రోజుల నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి విఘ్నాలు లేకుండా, ప్రశాంతంగా, విజయవంతంగా జరగాలని భక్తులు ప్రార్థించారు.అనంతరం మంటప నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్ మెంట్ కు చెందిన మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవ ఏర్పాట్లలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు.నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఏటా లాగే ఈ ఏడాది కూడా భక్తి శ్రద్ధలతో, పర్యావరణ హితంగా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు.

# గణేష్ ఉత్సవాలకు పోలీసుల సూచనలు

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు... డీఎస్పీ ఏ శ్రీనివాసరావు



మచిలీపట్నం,శ్రీవార్త న్యూస్ కృష్ణాజిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు బందరు సబ్ డివిజన్ పరిధిలో గణేష్ ఉత్సవాలు నిర్వహించే కమిటీలకు బందరు డీఎస్పీ ఏ. శ్రీనివాసరావు 28 ముఖ్య సూచనలు జారీ చేశారు. గురువారం మచిలీపట్నంలో సీఐలతో కలిసి కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఈ మార్గదర్శకాలను వివరించారు.

### పోలీసులు జారీ చేసిన ముఖ్య సూచనలు ఇవే:

మండపాల ఏర్పాటుకు ముందుగా కమిటీని ఏర్పాటు చేసుకుని, పోలీస్ స్టేషన్ ద్వారా డీఎస్పీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. పబ్లిక్ ప్రదేశాలలో మున్సిపాలిటీ / పంచాయతీ, సొంత స్థలాలలో అయితే స్థల యజమాని అనుమతి ఉండాలి.ట్రాఫిక్ కు, ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేయాలి. మైకులు, సౌండ్ బాక్సులు, డీజేలకు పోలీసు అనుమతి తప్పనిసరి.రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి లౌడ్ స్పీకర్ కార్యక్రమాలు నిర్వహించరాదు.మండపంలో హుండీలు, విలువైన వస్తువుల భద్రత,



విద్యుత్ అధికారుల అనుమతి, ఫైర్ సేఫ్టీ పరికరాల ఏర్పాటు కమిటీ బాధ్యత.ఇతర మతాల వారికి, ప్రార్థనా మందిరాలకు ఇబ్బంది కలగకుండా చూడాలి. శాంతి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. అశ్లీల సూత్రాలు రాసిన డాన్సులు, ట్రాన్స్ జెండర్ తో మోసపూరిత జరిపించటం, బలవంతంగా చందాలు వసూలు చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు.భక్తులు ఇబ్బంది పడకుండా క్యూ లైన్లు, బారికేడ్లు, ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.ఊరేగింపు సమయంలో నిమజ్జనం చేయడానికి మధ్యలో వంటలు సేవించకుండా, శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా చేయాలి. ఊరేగింపు రూట్, సమయం ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.ఎక్కడెక్కడ విధి కొల్లాహ పద్ధతిలో మండపాలు ఏర్పాటు చేసుకుంటున్నారో పోలీసులకు తప్పనిసరిగా నోటీసు రూపంలో ఇవ్వాలి.

### డీజే పై ప్రత్యేక నిబంధనలు:

రూరల్ సర్కిల్ పరిధిలో ఏ రాజకీయ పార్టీ పాటలు, మతాలను, కులాలను రెచ్చగొట్టే పాటలు, సినిమా హాలోలకు సంబంధించిన పాటలు వేయరాదు. గణేష్ ఊరేగింపు సమయంలో దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద డీజే లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా నిర్వహించాలి. అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.ప్రశాంతమైన వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజలు విజయవంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని పోలీసులు కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎటువంటి వారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సమావేశంలో మచిలీపట్నం రూరల్ ఆర్.పేట సీఐ కె. ఏసుబాబు చిలకలపూడి సీఐ ఎస్ కె నబి, ఇనగుదురు సీఐ ఎస్. పరమేశ్వరరావు, పాల్గొన్నారు.

## కొమ్మారెడ్డి స్కూల్లో ఘనంగా హిందీ భాషాదినోత్సవం- వినాయక చవితి వేడుకలు



బంటుమిల్లి శ్రీవార్త న్యూస్: ఈనెల 14న జరగవలసిన జాతీయ హిందీ భాషాదినోత్సవాన్ని సెలవుల కారణంగా శుక్రవారం కొమ్మారెడ్డి స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 5 వ తరగతి నుండి 10 వ తరగతి వరకు గల విద్యార్థిని, విద్యార్థులు హిందీ కవులు, కవయిత్రుల వేషధారణలు ధరించి అందరిని అలరించారు. హిందీ కవులు, కవయిత్రుల వేషధారణలు ధరించిన విద్యార్థిని, విద్యార్థులకు కూడా బహుమతులు ప్రధానం చేశారు. కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య మాట్లాడుతూ హిందీ మన జాతీయ మరియు రాజభాష అని నేడు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందికి జీవనోపాధిగా మారిందని, ప్రతి విద్యార్థి హిందీని శ్రద్ధగా నేర్చుకుని హిందీలో ప్రావిణ్యతను సాధించి దేశ, విదేశాలలో ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరుతూ హిందీ భాషాదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలలో వినాయక చవితి వేడుకను ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్రీమతి పి. వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులచే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి వినాయకుని పూజిద్దాం -- పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో మట్టి వినాయక విగ్రహాలు చేయమని విద్యార్థులను ప్రోత్సహించడం జరిగింది. తమ చిట్టి చిట్టి చేతులతో దాదాపు 50 మంది చిన్నారులు మట్టి, వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పిండి పదార్థాల తో చేసిన వినాయక విగ్రహాల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అలాగే శివుడు, పార్వతి, వినాయకుడు, కుమారస్వామి వేషాలు ధరించి చిన్నారులు అందరిని అలరించారు. కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు విధిగా మట్టి వినాయకుని పూజించాలని, యువత అత్యంత ఉత్సాహంగా వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్నా గాని నిమర్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం ప్రీ- ప్రైమరీ ఇంచార్జ్ పి. వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ శ్రీ కొమ్మారెడ్డి చైతన్య వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి స్కూల్ హెచ్.ఎం. ఎన్.శ్రీనివాసరావు, పి. ఈ.టి కె. శ్రీనివాస రావు తెలుగు ఉపాధ్యాయులు వి. సాంబశివరాజు ఎల్కేజీనుండి 2 వ తరగతి వరకు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉయ్యూరు రాఘవేంద్ర హైట్స్ లో వినాయక మంటపం సర్వాంగ సుందరం



ఉయ్యూరు,శ్రీ వార్త న్యూస్ :రాబోయే వినాయక చతుర్థి పండగను పురస్కరించుకుని ఉయ్యూరులోని రాఘవేంద్ర హైట్స్ లో వినాయక మంటపాన్ని నిర్వాహకులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.ఉత్సవాల్లో భాగంగా స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనకు, ప్రత్యేక పూజా కార్యక్రమాలకు కావలసిన అన్ని ఏర్పాట్లను ఎంతో వైభవంగా పూర్తి చేశారు.

## కౌశలం ద్వారా 45 మందికి ఉద్యోగ అవకాశాలు



మచిలీపట్నం ,శ్రీవార్త న్యూస్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మచిలీపట్నం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన కౌశలం ప్లేస్ మెంట్ డ్రైవ్ లో 45 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. నాయుడుపేటకు చెందిన Green Tech Industries India Pvt. Ltd. సంస్థ మెషిన్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి ఈ డ్రైవ్ నిర్వహించింది. మొత్తం 145 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగా, అర్హత సాధించిన 45 మందికి అక్కడికక్కడే నియామక ఉత్తర్వులు అందజేశారు.నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధితో పాటు వారి నైపుణ్యాలకు తగ్గ ఉద్యోగాలను అందించడమే కౌశలం లక్ష్యమని అధికారులు తెలిపారు. జిల్లాలోని యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి జి. పద్మ, జిల్లా కోఆర్డినేటర్ కె. రవికాంత్, డిప్యూటీ సీఈఓ ఆర్ సి ఆనంద్ కుమార్ తో పాటు మండల స్వర్ణ గ్రామాల అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్ చొరవతో 25 ఏళ్ల సమస్యకు పరిష్కారం పీజీఆర్ఎస్ అర్జీపై ప్రత్యేక దృష్టి.. 84 మందికి లబ్ధి

### కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజి ముఖ్యమంత్రి అభినందనలు



అమరావతి శ్రీ వార్త న్యూస్ :ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీపై కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ప్రత్యేక చొరవ చూపడంతో 25 ఏళు ్లగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించి 84 మంది లబ్ది పొందారు. ప్రజా సమస్యల పరిష్కారంలో



కలెక్టర్ చూపిన చొరవ, వ్యక్తిగత పర్యవేక్షణకు ఇది నిదర్శనంగా నిలిచింది.అమరావతి రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఎనిమిదవ కలెక్టర్ల సదస్సులో పీజీఆర్ఎస్ 'మీకోసం' కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత, సమాచార ప్రసారాల శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో ఆదర్శంగా నిలిచిన జిల్లాల వివరాలను వెల్లడించారు.నెల్లూరు, నంద్యాల, కృష్ణా, సత్యసాయి జిల్లాలు అర్జీల పరిష్కారంలో ప్రత్యేక పనితీరు కనబరుస్తున్నాయని తెలిపారు. దీనిలో భాగంగా కలెక్టర్ డీకే బాలాజి, కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం పరిధిలోని శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి ఆలయ భూమికి సంబంధించి 25 సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యను ప్రత్యేకంగా పర్యవేక్షించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించడంతో 84 మందికి ప్రయోజనం కలిగిందని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజిని అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కృష్ణా జిల్లా కలెక్టర్ చూపిన చొరవను ఇతర జిల్లాల అధికారులు కూడా స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

## కవి సామ్రాట్ విశ్వనాథ జయంతి ఘనంగా నిర్వహణ



మచిలీపట్నం,శ్రీవార్త న్యూస్తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలు శుక్రవారం మచిలీపట్నం నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.మచిలీపట్నం సమీపంలోని పెడన మండలం నందమూరులో జన్మించిన విశ్వనాథ సత్యనారాయణ దేశవ్యాప్తంగా తెలుగువారి కీర్తి కిరీటాన్ని సుస్థిరంగా నిలిపారని వక్తలు కొనియాడారు. లక్ష పేజీలకు పైగా నవలలు, కవిత్వం రాసిన ఘనత విశ్వనాథునికే దక్కిందని అన్నారు. ఆయన రచించిన 'వేయి పడగలు' నవల నేటికీ సాహిత్య రంగంలో సజీవంగా నిలిచి ఉందన్నారు.విశ్వనాథ సత్యనారాయణ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అన్ని కార్యాలయాల్లో, పాఠశాలల్లో నిర్వహించాలని, అమరావతిలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వక్తలు కోరారు.ఈ సందర్భంగా విశ్వనాథ రచించిన పుస్తకాలను ప్రదర్శించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.అనంతరం మచిలీపట్నంలో పుట్టి చరిత్రలో నిలిచిపోయిన ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు, జాతీయ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు భోగరాజు పట్టాభి సీతారామయ్య, ప్రపంచ క్రికెట్ కెప్టెన్ సి.కె. నాయుడు, జెండా వీరుడు తోట నరసయ్య నాయుడు, జాతీయ పతాక సృష్టికర్త పింగళి వెంకయ్య వంటి ప్రముఖుల చిత్రాలను నగర కార్పొరేషన్ కాంపౌండ్ వాల్ పై చిత్రీకరించి చరిత్రను నేటి తరానికి తెలియపరుస్తున్న కమిషనర్ సిహెచ్. బాపిరాజును సాహితీ మిత్రుల సంస్థ అధ్యక్షుడు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, భావ తరంగిణి ఎడిటర్ శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ సిహెచ్. బాపిరాజు, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, సాహితీ మిత్రుల సంస్థ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, ప్రముఖ సాహిత్యవేత్త డా. బృందావనం ధన్వంతరి ఆచార్య, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణికుమార్, సీనియర్ జర్నలిస్ట్ ముదిగొండ శాస్త్రి, భావ తరంగిణి ఎడిటర్ భవిష్య, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001